ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక




ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
Publisher&Editor: 9391690609,Office :7893003409
aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

సుఫల

# అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

మంగళవారం 23 జూలై 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 125 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

ముగ్గురు నిపుణులతో నేడు సమాధానం ఇవ్వాలన్న ధర్మాసనం

మే 4కు ముందే పేపర్ లీకేజీ జరిగినట్లు సిబిఐ అనుమానం



# మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.పది వేల కోట్లు ఇవ్వండి

**జల్ జీవన్ మిషన్ నిధులు విడుదల చేయండి..**

**గ్యాస్ సబ్సిడీ ఓఎంసీలకు ముందుగానే చెల్లించేయండి**

**పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి...**

**కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్‌దీప్ సింగ్ పూరీ, జోషిలకు సిఎం రేవంత్ వినతి**

**న్యూఢిల్లీ,జూలై22(అక్షరం న్యూస్):**
తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద రూ.పది వేల కోట్లు కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడ లేని విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు సి.ఆర్.పాటిల్, హర్ దీప్ సింగ్ పూరీ, ప్రహ్లాద్ జోషిలను ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలోని మురికి నీరు అంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేసేందుకు





# వివాదంలో ఐఎఎస్ స్మితా సబర్వాల్

**సివిల్స్ ఎంపికలో వికలాంగ కోటాపై పోస్ట్ తేనెతుట్టెను కదపడంతో పలువురు విమర్శలు**



**హైదరాబాద్,జూలై22(అక్షరం న్యూస్):**
ట్రైనీ ఐఎఎస్ అధికారి పూజా ఖేద్కర్ వివాదం తర్వాత ఇప్పుడు సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానం గురించి కొత్త చర్చ మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఐఏఎస్‌లో వికలాంగుల కోటాపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. వైకల్యం ఉన్న పైలట్‌ను ఎయిర్‌లైన్ నియమించుకుంటుందా? లేదా మీరు వైకల్యం ఉన్న సర్జన్‌ని విశ్వసిస్తారా అంటూ పోస్ట్ చేశారు. సివిల్ సర్వీసెస్ అధికారుల బాధ్యత అనేది ఫీల్డ్ వర్క్, పన్నులు విధించడం, ప్రజల మనోవేదనలను నేరుగా వినడం వంటివి ఉంటాయి. కాబట్టి ఈ ప్రీమియర్ సర్వీస్‌కు ఈ కోటా అవసరమా అని తన అభిప్రాయాలను

# రసవత్తరంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు

**బరిలోంచి తప్పకుంటున్నట్లు బైడెన్ ప్రకటన**

**కమలా హారిస్‌కు మద్దతు తెలిపిన అధ్యక్షుడు జోబైడెన్**

**తొలిసారి రేసులో భారత సంతతి అమెరికా మహిళ**

**బైడెన్ తప్పకోవడాన్ని స్వాగతించిన ఒబామా**

**అనూహ్యంగా మిషెల్ ఒబామా పేరు తెరపైకి రాక**

**న్యూయార్క్,జూలై22:**
అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఆసక్తికరంగ ఆమారబోతున్నాయి. ట్రంప్‌కు పోటీగా మారోమారు బరిలిలో నిలవాలనుకున్న ప్రస్తు అధ్యక్షుడు జో బైడెన్ బరినుంచి తప్పుకున్నారు. తన మద్దతును ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు ప్రకటించారు. అనూహ్యంగా ఇప్పుడు తెరపైకి మాజీ అధ్యక్షుడు ఒబామా సతీమణి





# భద్రాచలం వద్ద గోదావరి ఉధృతం

**రెండో ప్రమాద హెచ్చరిక చేరువలో ప్రవాహం**

**సహాయక చర్యలకు సిద్దంగా అధికారయంత్రాంగం**

**భద్రాచలం,జూలై22(అక్షరం న్యూస్):**
భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ఉరుకులు పెడుతున్నది. సోమవారం



# పోలవరంపై కీలక ముందడుగు

**రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం**

**మోడీ సహకారంతో సవాళ్లను అధిగమిస్తున్నాం**

**మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై22:**
ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం విషయంలో కీలక ముందడుగు పడింది. పోలవరం ప్రాజెక్ట్ మొదటి దశ నిర్మాణానికి రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. కేంద్ర కేబినెట్ ఆమోదంతో ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామంతో శరవేగంగా పనులు జరగనున్నాయి. కూటమి సర్కార్‌కు ఇదొక తియ్యటి కబురే అని చెప్పుకోవచ్చు. ఈ ప్రకటన తర్వాత.. ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సహకారంతో పోలవరం సవాళ్ళను అధిగమిస్తూ ముందుకు వెళతామన్నారు. పోలవరానికి రావాల్సిన రూ. 12,157 వేల కోట్లు త్వరగా ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. ఇందులో 8 వేల కోట్ల రూపాయిలు పునరావసానికి ఖర్చు చేయాల్సి ఉందని చెప్పారు.



# భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం

**పలు గ్రామాల రాకపోలకు అంతరాయం**

**సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం**



# మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.పది వేల కోట్లు ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీలో చేరే మురికి నీరును శుద్ధి చేయడం, వరద నీటి కాల్వల నిర్మాణం, స్థాయి పెంపు, మూసీ సుందరీకరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద దక్కన్ పీఠభూమిలోని నదుల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్రం యోచిస్తున్నందున మూసీలో కలిసే మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు కోట్లు కేటాయించాలని కోరారు. గోదావరి జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతో నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు చెరువులను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు తీరడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణకు నిధులు విడుదల చేయాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2019 లెక్కల ప్రకారం జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 77.60 శాతం ఇళ్లకు నల్లా నీరు అందుతోందని, ఇటీవల తాము చేపట్టిన సర్వేలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని తేలిందని వివరించారు. ఆ ఇళ్లతో పాటు పీఎంఏవై (అర్బన్), (రూరల్) కింద చేపట్టే ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు మొత్తంగా రూ.16,100 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. 2019లో జల్‌జీవన్ మిషన్ ప్రారంభించినా నేటి వరకు రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, ఈ ఏడాది నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి పూరీని పార్లమెంట్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. తాము ముందుగానే సబ్సిడీ చెల్లిస్తామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని గ్యాస్ ఏజెన్సీలను గతంలోనే కోరినా సానుకూలత వ్యక్తం కాలేదన్నారు. ప్రస్తుతం వినియోగదారులు సిలెండర్‌కు పూర్తిగా డబ్బులు చెల్లించిన తర్వాత సబ్సిడీ
అందుతుండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్యాస్ సిలిండర్లకు చెందిన సబ్సిడీని ముందుగానే ఓఎంసీలకు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే వినియోగదారులు రూ.500 చెల్లించి సిలిండర్ తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ముందుగానే రాయితీని తాము ఓఎంసీలకు చెల్లిస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలా వీలుకాని పక్షంలో వినియోగదారులకు తమ ప్రభుత్వం చెల్లించే సబ్సిడీని 48 గంటల్లోపు అందేలా చూడాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నుంచి రావల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. 2014-15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ.1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. అందుకు సంబంధించిన అన్ని పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని గుర్తు చేశారు. అందువలన బకాయిపడిన ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రి పూరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఖమ్మం, జహీరాబాద్ ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

# గోదావరి ఉధృతం

ఉదయం 46.80 అడుగులకు చేరింది. మరో రెండు అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక జారీచేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 44 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నది ఉగ్రరూపం దాల్చింది. సోమవారం నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదారమ్మ మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లు కాగా, ప్రస్తుతం 15.130 మీటర్లు వుంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. భద్రాద్రి జిల్లాలో ఉన్న రెండు ప్రాజెక్టులకు వరద నీరు చేరింది. కిన్నెరసానిలో 16 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదలిపెట్టారు. 407 అడుగుల నీటి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 403.30 అడుగులు నీటిమట్టం ఉంది. సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తివేశారు. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో మొత్తం 25 గేట్లను ఎత్తి 92,121 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. గోదావరి వరద ప్రభావం వల్ల అక్కడ ఈతవాగు పొంగడంతో గుంపల్లి చర్ల గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పర్ణశాలలో సీతవాగు పొంగి ప్రవహిస్తోంది. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా
వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి వరద 73 అడుగుల స్థాయిని తాకితే పరీవాహక ప్రాంతాల్లో 109 గ్రామాలు, భద్రాచలం పట్టణం ముంపునకు గురవుతాయని నీటిపారుదలశాఖ ప్రకటించింది. 48 అడుగుల స్థాయి నుంచే పలు గ్రామాలకు ముప్పు మొదలవుతుందని సూచించింది. 48 అడుగుల స్థాయి నుంచే పలు గ్రామాలకు ముప్పు మొదలవుతుందని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏ మట్టం స్థాయిలో ఏ గ్రామం ప్రభావితమవుతుందనే వివరాలను నీటిపారుదలశాఖ పోర్టల్లో ఉంచినట్లు ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ తెలిపారు. గోదావరి, కృష్ణా పరీవాహకాల్లోని ప్రాజెక్టుల వద్ద ఇంజినీర్లను అప్రమత్తం చేశామన్నారు. అశ్వారావుపేట మండలంలో వరదలకు కొట్టుకుపోయిన పెద్దవాగు ప్రాజెక్టు నిర్వహణ విషయంలో అలసత్వం వహించిన ఇంజినీర్లపై చర్యలకు నీటిపారుదలశాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొత్తగూడెం సర్కిల్ సీఈ శ్రీనివాసరెడ్డి పంపించిన నివేదిక ప్రకారం ఈఈ, డీఈఈ, ఏఈఈలపై చర్యలకు ఈఎన్సీ అనిల్‌కుమార్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఒకటి రెండు రోజుల్లో క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.

## భారీ వర్షాలతో జనజీవనం
# అస్తవ్యస్తం

**హైదరాబాద్,జూలై22(అక్షరం న్యూస్):**
రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. పగటివేళ ముసురు వాన కురుస్తుండగా.. రాత్రిళ్లు వాన దంచికొడుతోంది. హైదరాబాద్ నగరంతోపాటు జిల్లాలు తడిసిముద్దయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు జిల్లాల్లో అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అనేకప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. పంటలు నీటమునిగాయి. భారీ వర్షాలకు గోదావరి, కృష్ణా నదుల పరీవాహకాల్లోని ప్రాజెక్టులకు ప్రవాహం పెరిగింది. వరద పరిస్థితులపై రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో 14 సెం.మీ. వర్షం కురిసింది. గోదావరి ఉగ్రరూపం దాల్చి.. భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చింది. దీంతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఈ సీజన్‌లో తొలిసారిగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామానికి చెందిన పశువుల కాపరి పంతంగి లక్ష్మయ్య(55) ఆదివారం భారీ వర్షానికి తడిసి.. చలి తీవ్రతకు మృతి చెందారని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం బొప్పరికుంటకు చెందిన టేకం లక్ష్మణ్(22) గంగాపూర్ సమీపంలోని వంకతుమ్మ వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం దాటుతున్న సమయంలో నీటి ప్రవాహంలో పడి గల్లంతయ్యారు. మరోవైపు వర్షంతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. పలుచోట్ల ములుగు జిల్లా వాజేడు మండలంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై గోదావరి వరద
సోమ, మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ప్రధానంగా సోమవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ మధ్య అల్పపీడనం కేంద్రీకృతమైందని వెల్లడించింది. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు చిన్న చిన్న వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చర్ల మండలంలో ఈత వాగు ప్రవాహంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లిలకు మండల కేంద్రమైన చర్లతో సంబంధాలు తెగిపోయాయి. ఇదే జిల్లా దుమ్ముగూడెం మండలంలో సీతవాగు, గుబ్బల మంగి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన రహదారిపై చట్టి వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని జాతీయ రహదారిపై గోదావరి వరద పోటుతో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులను పోలీసులు అనుమతించడం లేదు. ప్రభుత్వ ఆదేశాలతో వాగుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రవాహాలను దాటనివ్వడం లేదు. భద్రాచలం నుంచి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై వరద పోటెత్తడంతో ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ములుగు జిల్లాలో దాదాపు 20 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వాజేడు మండలం టేకుపల్లి వద్ద 163వ జాతీయ రహదారిపైకి గోదావరి వరద వచ్చి చేరడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పేరూరు వద్ద సాయంత్రం 5 గంటల వరకు గోదావరి 15.83 మీటర్లతో ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలంలో గోదావరి నీటిమట్టం
మొదటి ప్రమాద హెచ్చరికకు దగ్గరలో ఉంది. పేరూరు-చంద్రుపట్ల గ్రామాల మధ్య మరివాగు, వాజేడు-గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్య కొంగాల వాగు ఉప్పొంగుతున్నాయి. కలిపాక, సీతారాంపురం, ముత్తారం పరిధిలోని వాగుల్లో భారీగా వరదతో ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జంపన్న వాగుకు వరద పోటెత్తుతోంది. భూపాలపల్లి జిల్లాలో వరదల కారణంగా 15 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గోరికొత్తపల్లి మండలం సుల్తాన్‌పూర్ సమీపంలోని వాగుపై నిర్మిస్తున్న వంతెన బైపాస్ రోడ్డు వరద ధాటికి కొట్టుకుపోయింది. టేకుమట్ల మండలంలోని మానేరు, చలివాగు పొంగుతుండడంతో సమీపంలోని గ్రామాలతో పాటు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా స్తంభించింది. మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గూడూరు, బయ్యారం మండలాల్లో వాగులు పొంగుతుండడంతో 5 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామంలోని కొత్తవాడ(పద్మశాలి) కాలనీ వరదతో ముంపునకు గురైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా నది జోరుగా ప్రవహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చర జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్యాటకుల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. సింగరేణి బొగ్గు గనుల్లో.. ప్రధానంగా ఉపరితల గనుల్లో ఉత్పత్తికి ఆటంకం కలిగింది. సాధారణ రోజుల్లో సింగరేణి 2.1 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తుంది. గత మూడు రోజులుగా రోజువారీ ఉత్పత్తి 90 వేల టన్నులు సాధించడం గగనంగా మారింది.

## రసవత్తరంగా అమెరికా
# అధ్యక్ష ఎన్నికలు

మిషెల్ ఒబామా పేరు కూడా వచ్చింది. భారతీయ మూలాలున్న కమలా హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచినట్లు వార్తు రావడం, మిషెల్ కూడా రంగంలోకి వచ్చినట్లు తేలడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ 2024 అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని నిర్ణయించగా, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌కి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 81 ఏళ్ల బైడెన్ వయోభారంతో, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను పోటీ నుంచి తప్పు కొంటున్నట్లు ప్రకటించారు. డెమొక్రాట్ల సీనియర్ల ఒత్తిడిని గౌరవిస్తున్నట్లు వ్యాఖ్యానిం చారు. అయితే డెమొక్రాట్ల నుంచి కమలా హారిస్‌కే అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. కాలిఫోర్నియాలోని జమైకా-అమెరికన్ ప్రొఫెసర్ డోనాల్డ్ జె హారిస్, తమిళ జీవశాస్త్రవేత్త శ్యామాల గోపాలన్ దంపతులకు కమలా దేవి హారిస్1964 అక్టోబర్ 20న జన్మించారు. కమలా హారిస్ భారత సంతతి మహిళగా గుర్తింపు పొందారు. అయితే ఆమె తల్లిదండ్రులు కొన్నాళ్లకే విడాకులు తీసుకున్నారు. అనంతరం కమలా తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. ఆమె తన బ్యాచిలర్ డిగ్రీ కోసం చారిత్రాత్మక ఆల్ బ్లాక్ కళాశాల అయిన హోవార్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. కమలా హారిస్ పొలిటికల్ సైన్స్, ఆర్థికశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్రంలో చేరారు. 1990 లో బార్ అసోసియేషన్ సభ్యురాలిగా మారి, అదే ఏడాది కాలిఫోర్నియాలో డిప్యూటీ డిస్ట్రిక్ట్ అటార్నీగా వృత్తిని ప్రారంభించారు. 2003లో శాన్?ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ అటార్నీగా ఎన్నికయ్యారు. 2007 చివరలో, అప్పటికే జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఒకసారి, 2014లో మరోసారి అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. 2017లో ఆమె తన స్వరాష్ట్రం నుంచి జూనియర్ యూఎస్ సెనేటర్ అయ్యారు. ఆరోగ్య సంస్కరణలు, పన్ను,వలసదారులకు పౌరసత్వం, తుపాకీ నియంత్రణ చట్టాల మీద ప్రచారాలతో ఆమె పేరు ప్రపంచ వ్యాప్తంగా ఒక్కసారిగా మార్మోగిపోయింది. సెనేట్‌లో పనిచేసిన రెండో ఆఫ్రికన్ అమెరికన్, తొలి ఆగ్నేయాసియా మహిళగా గుర్తింపు పొందారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కమలా హారిస్, జో బైడెన్‌కు మద్దతుగా రేసు నుంచి తప్పుకున్నారు. అనంతరం ఆయన పాలనలో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా అమెరికా అధ్యక్ష బరిలో దిగుతున్నారు. ఆగస్టులో జరగనున్న ఈవెంట్‌లో డెమొక్రాట్లు తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఈ నామినేషన్‌లో గెలిస్తే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి భారత సంతతి మహిళగా కమలా హారిస్ చరిత్ర సృష్టిస్తారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధిస్తే, దేశానికి మొదటి భారతీయ సంతతి మహిళ అధ్యక్షురాలు కాగలరు. 'అమెరికా అధ్యక్ష రేసులో నిలిచేందుకు అధ్యక్షుడి ఆమోదం పొందడం గౌరవంగా ఉంది,' అని కమలా పేర్కొన్నారు. జో బైడెన్ కన్నా కమలా హారిస్‌ను ఓడించడమే చాలా సులభం అని ట్రంప్ వ్యాఖ్యానించడం తో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. వైట్ హౌస్ రేసు నుండి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు. బైడెన్ తీసుకున్న నిర్ణయం దేశంపై ఆయనకున్న ప్రేమను చాటుతోందని ఒబామా వ్యాఖ్యానించారు. రెండోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని.. అయినప్పటికీ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బైడెన్ అంతర్జాతీయ వేదికపై అమెరికా గొప్పతనాన్ని ఇనుమడింపజేశారని, నాటోను పునరుజ్జీవింపజేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్ - రష్యా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలను ఏకం చేశారన్నారు. అయితే రానున్న రోజుల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని, అధ్యక్ష అభ్యర్థి ఎంపికలో డెమొక్రటిక్ పార్టీ ఆచితూచి అడుగులు వేయాలని అప్రమత్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ని అధ్యక్ష బరిలో నిలపాలని ఆ పార్టీ ఆలోచిస్తున్నా.. ఒబామా ఈ అంశాన్ని లేవనెత్తకపోవడం, అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అనడం పార్టీలో చర్చనీయాంశం అవుతోంది. కమలా హారిస్ అభ్యర్థిత్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన పక్రియతో ముందుకు రావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఒబామాను హారిస్‌కు మెంటార్‌గా చెబుతుంటారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన మరో కీలక నేత నాన్సీ పెలోసీ సైతం కమలా హారస్‌కు మద్దతు ప్రకటించక పోవడంతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. 2007లో జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు కమలా.. మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఆమె అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామా ను బరిలో నిలుపుతారనే ఊహాగానాలు కూడా బలపడుతున్నాయి. పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు బైడెన్ ప్రకటించిన తరువాత మిషెల్ ఒబామా పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. ఓ వైపు కమలా హ్యారిసే డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీలో ఉంటుందని అంతా అనుకుంటుండగా.. మిషెల్ ఒబామా పేరు బయటకి రావడం గమనార్హం. ఆమె అభ్యర్థిత్వానికి పార్టీలోని చాలా మంది అనుకూలంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మూడు నెలలు ముందు ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆ పార్టీ అభ్యర్థిగా మిషెల్ ఒబామాను ప్రకటించే అవకాశాలున్నాయని డెమోక్రాట్లు అభిప్రాయపడుతున్నారు. ది సెంటర్ స్క్వేర్ ఓటర్స్ వాయిస్ ఇటీవలే నిర్వహించిన సర్వే ప్రకారం.. అమెరికా ఓటర్లు తమ తదుపరి అధ్యక్ష అభ్యర్థిగా మిషెల్‌నే కోరుకుంటునట్లు తేలింది. ఈ సర్వేలో కమలా హారిస్ కంటే మిషెల్‌కే ఎక్కువ మద్దతు లభించింది. కమలా హారిస్ అభ్యర్థి త్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన పక్రియతో ముందుకురావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఒబామా లెక్కలు వేరేగా ఉన్నాయని.. తన భార్యను అధ్యక్ష బరిలోకి దింపడానికే కమలాకు మద్దతు ప్రకటించట్లేదని అంతర్గతంగా చర్చ నడుస్తోంది. సాధారణంగా అమెరికాకు ఒక్కరు గరిష్ఠంగా రెండుసార్లు అధ్యక్షులుగా వ్యవహరించొచ్చు. ఒబామా రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడిగా పని చేశారు. ఇదే సమయంలో మిషెల్ ఒబామాకు నెటిజన్ల నుంచి మద్దతు వస్తోంది. ట్రంప్‌ని ఓడించగల ఒకే ఒక్క వ్యక్తి మిషెల్ అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'దయచేసి మిషెల్ ఒబామాపై దృష్టి పెట్టండి. కమలా హారిస్‌ని పోటీలో నిలపకండి. ఆమెకు ప్రజా సమస్యలు పట్టవు. ట్రంప్‌ని ఓడించలేరు' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. డెమోక్రటిక్ నేషనల్ కమిటీ కన్వెన్షన్ ఆగస్టు 19న చికాగోలో ప్రారంభం కానుంది. నవంబర్‌లో జరిగే సాధారణ ఎన్నికలకు తమ అభ్యర్థిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 4 వేల మంది ప్రతినిధులు ఇక్కడ సమావేశమవుతారు. ఆ తరువాత అభ్యర్థులు అధ్యక్ష బరిలో నిలుస్తున్నట్లు నామినేషన్‌లు సమర్పిస్తారు. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.

# వివాదంలో ఐఏఎస్ స్మితా సబర్వాల్

వెల్లడించారు. స్మిత సబర్వాల్ పోస్ట్ చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వికలాంగుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలు ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. వికలాంగులను 'సంకుచిత దృక్పథం'తో చూడరాదని, వారి అర్హతపై ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. దీనిపై శ్రీకాంత్ మిర్యాల అనే రచయిత, సైకియాట్రిస్ట్ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ప్రత్యక్ష ఉదాహరణలతో గతంలో ఎంబీబీఎస్ చదివేటప్పుడు తన ప్రిన్సిపాల్ కాలుకి పోలియో సోకి సరిగా నడవలేనివారు, అయినా కూడా ఎడమచేత్తో రాసి, పాఠాలు చెప్పారాని గుర్తు చేశారు. ఇలా అనేక మంది దివ్యాంగులు పలు రంగాల్లో ఉన్నట్లు గుర్తు చేశారు. అంతేకాదు ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఇలా ట్వీట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. మీ పని మీరు సరిగ్గా చేయండి చాలు. అంతేకానీ మీకు
సలహాలు ఇచ్చే స్థాయి ఇంకా రాలేదని చెబుతున్నారు. అంతేకాదు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దగ్గర పనిచేసిన ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణల మధ్య ఈ వివాదం మొదలైంది. యూపీఎస్సీ పరీక్షల్లో తన అభ్యర్థిత్వాన్ని పొందేందుకు వైకల్యం, ఇతర వెనుకబడిన తరగతి కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఫేక్ ఐడెంటిటీ ఇచ్చి అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయత్నిం చారనే ఆరోపణలపై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖేద్కర్‌పై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో స్మిత వ్యాఖ్యలు పలువురి విమర్శలకు కారణమయ్యింది.

## పోలవరంపై కీలక ముందడుగు

కాగా.. వైసీపీ పాలనలో కేంద్రం ఇచ్చిన నిధులన్నీ ఇష్టానుసారం వాడేసి ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే కూటమి సర్కార్ రాగానే తొలుత పోలవరంపైనే సీఎం నారా చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం పోలవరం కోసమే కేటాయిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా.. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రుల దృష్టికి పలుమార్లు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల విషయాన్ని మాట్లాడారు. దీంతో పాటు.. పార్లమెంట్ సమావేశాలతో పాటు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్ పాటిల్‌ను ప్రత్యేకంగా కలిసి ఎంపీలు నిశితంగా వివరించారు. ఈ క్రమంలోనే ప్రాజెక్ట్ కోసం రూ.12 వేల కోట్ల ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపింది. ఇదిలావుంటే రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు ఢిల్లీలో పర్యటించారు. పోలవరం నిధులపై కేంద్రంతో చర్చించారు. గత ప్రభుత్వం హయాంలో కేంద్రం ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. కేంద్రం సానుకూలంగా ఉందని, నిధుల విడుదలకు అంగీకరించిందని అన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా తమ ప్రాధాన్యం పోలవరం అని తెలిపారు. చంద్రబాబుతో పాటు ఎంపీల ప్రయత్నాలు ఫలించాయి. ఇదిలా ఉంటే.. ఇవాళ పార్లమెంట్ సమావేశాల్లో పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి అయ్యేందుకు కేంద్రం భారీగా నిధులివ్వాలని ఎంపీ కేశినేని శివనాథ్ కోరడం జరిగింది. రూల్- 377 కింద పోలవరం ప్రాజెక్ట్ నిధులపై ఆయన మాట్లాడి.. పోలవరం నిర్మాణానికి కేంద్రం తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. మిషన్ మోడ్ కింద పోలవరం ప్రాజెక్ట్‌ను తిరిగి ట్రాక్‌లోకి తీసుకువచ్చేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్న విషయాన్ని లోక్‌సభలో తెలియజేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే దేశంలోని ఆరు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందన్న విషయాన్ని పార్లమెంట్‌లో కేశినేని చిన్ని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో సివిల్ పనులు 3.84?, భూ సేకరణ పనులు 3.89? మాత్రమే జరిగాయని.. 2019 నాటికి, సివిల్ పనులు 71.93?, భూసేకరణ పునరావాసం పనులు 18.66శాతం పూర్తి అయ్యాయని లోక్‌సభలో నిశితంగా ఎంపీ వివరించారు. పోలవరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, భవిష్యత్తుకు ప్రాణాధారం అని కేశినేని చిన్ని చెప్పుకొచ్చారు.

## నీట్ అవకతవలకపై సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ,జూలై22: నీట్-యూజీ 2024 పరీక్ష పత్రం లీకేజీ, అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా నీట్- యూజీ పరీక్షలో వచ్చిన ఓ ప్రశ్న విషయంలో తీవ్ర చర్చ జరిగింది. ఒకే ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఇచ్చారని, మార్కులు మాత్రం ఒక్కదానికే వేశారంటూ పిటిషనర్లు వాదించారు. దానికి మార్కులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మెరిట్ లిస్టు మారే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. సదరు ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత సబ్జెక్టుకు చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటు చేసి, మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు దానిపై సమాధానం సమర్పించాలని ఐఐటీ- ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది. అంతకుముందు ఇదే అంశంపై వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. మే 4కు ముందే పేపర్ లీక్ అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బిహార్ పోలీసుల దర్యాప్తు నివేదికను ప్రస్తావిస్తూ.. స్ట్రాంగ్ రూమ్ నుంచే ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా? అని ప్రశ్నించింది. ఈసందర్భంగా నిందితులకు మే4వ తేదీ రాత్రి గుర్తుంచుకోవాలని చెప్పారంటే.. లీక్ ఆ తేదీ కంటే ముందే జరిగి ఉండొచ్చని సీజేఐ డీవై చంద్రచూడ్ అనుమానం వ్యక్తంచేశారు. అలా అయితే.. స్ట్రాంగ్ రూమ్ వాలెట్‌లో ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా.. అని ప్రశ్నించారు. బిహార్ పోలీసుల దర్యాప్తు రిపోర్టును ఉటంకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు పిటిషనర్ల పక్షాన వాదిస్తున్న న్యాయవాది నరేందర్ హుడా తన వాదనలు వినిపిస్తూ..161 వాంగ్మూలాలు పేపర్ లీక్ మే 4వ తేదీ కంటే ముందే చోటుచేసుకొందని బలంగా చెబుతున్నట్లు పేర్కొన్నారు. బిహార్ పోలీసుల రిపోర్టు ప్రకారం సంబంధిత బ్యాంకుల్లో ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయటానికి ముందే లీకైందని పేర్కొన్నారు. మే 3వ తేదీ లేదా అంతకంటే ముందే పేపర్ బయటకు వెళ్లిండొచ్చని పేర్కొన్నారు. ఇదేదో 5-10 మంది విద్యార్థుల కోసం చేసిన లీకేజీ కాదని హుడా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కచ్చితంగా ఓ గ్యాంగ్ ఎప్పటినుంచో ఈ పని చేస్తోందని పేర్కొన్నారు. సంజీవ్ ముఖియా, ఇతర కీలక నిందితులు అరెస్టు కాలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఒకచోట ప్రశ్నపత్రాన్ని రిక్షాలో కూడా తరలించారని ఆయన న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. నీట్-యూజీ 2024కు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సోమవారం నుంచి సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం విచారిస్తోంది. ఇందులో నీట్‌కు సంబంధించిన 40 పిటిషన్లు ఉన్నాయి. వీటిల్లో వివిధ రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లు అన్నింటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలన్న ఎన్‌టీఏ అభ్యర్థన కూడా ఉంది.

## నేటినుంచి తెలంగాణ అసెంబ్లీ
### దివంగత లాస్య నందితకు నివాళి

హైదరాబాద్,జూలై22: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు శాసనసభ ప్రారంభమవుతుంది. అనంతరం దివంగత ఎమ్మెల్యే లాస్య నందితకు అసెంబ్లీ సంతాపం తెలుపునున్నది. లాస్య నందితకు సంతాపం తెలిపే తీర్మానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రవేశపెడుతారు. సంతాపం అనంతరం శాసనసభ నిరవధికంగా వాయిదాపడనున్నది. సభ వాయిదా అనంతరం సభా వ్యవహారాల కమిటీ భేటీ కానున్నది. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశాల పనిదినాలు, అజెండాను బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఖరారు చేయనున్నది. శాసనమండలి బుధవారం నుంచి ప్రారంభం అవుతుంది. తాజా సమాచారం ప్రకారం సమావేశాలు ఆగస్ట్ 2 వరకు జరిగే అవకాశం ఉంది. రైతురుణమాఫీ, రైతుభరోసా, ఇతర పలు అంశాలపై సభలో చర్చించే అవకాశం ఉంది. ఆర్థికస్థితి సమా మేడిగడ్డ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. సమావేశాలకు సంబంధించి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 చికిత్సలు
### మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

**హైదరాబాద్,జూలై22(అక్షరం న్యూస్):**
తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ చికిత్సకు సంబంధించిన ధరలను సవరించింది. 1,375 ప్యాకేజీల ధరలను సవరిస్తూ జీవో 30ని జారీ చేసింది. మిగిలిన 297 ప్యాకేజీ ధరల్లో మార్పు లేదని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. అదే సమయంలో కొత్తగా 163 చికిత్సలను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సగటున 20 నుంచి 20శాతం రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీలో కొత్తగా తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వంపై రూ.438 కోట్ల భారం పడుతుందన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి అదనపు ఖర్చు రూ.600 కోట్లు పెరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా దాదాపు 6 లక్షల మందికి బాసటగా ఉందన్నారు. కొత్త ప్రొసీజర్స్‌తో మరో లక్షన్నర కుటుంబాలను ఆదుకోబోతుందన్నారు. 79లక్షల కుటుంబాలకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇదిలా ఉండగా.. ఆరోగ్యశ్రీ పేదలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించే పథకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

# ఓబిసి డిక్లరేషన్ ప్రకటించాలని తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేత

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓబీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**

**-తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులు**



**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**

రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ పిలుపుమేరకు మరియు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ సూచన మేరకు మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ మరియు బిజెపి పట్టణ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా పెద్దపల్లి మండల్ తాసిల్దార్ కి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తసిల్దార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారని స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారని తెలిపారు గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఆకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారని అన్నారు బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని అన్నారు బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా బిడ్లు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెరలేపుతున్నారని ఆరోపించారు ముదిరాజ్ గంగపుత్ర గౌడ్ మున్నూరు కాపు పద్మశాలి విశ్వకర్మ రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోవడం లేదని కామారెడ్డిలో ప్రకటించిన విధంగా ఓబిసి డిక్లరేషన్ ప్రక్రియ ప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పోల్సానీ సంపత్ రావు కౌన్సిలర్ రాజమహంత కృష్ణ జీవన్ రెడ్డి ఎర్రోళ్ల శ్రీకాంత్ వేల్పుల రమేష్ సోడా బాబు గాండ్ల రాజేశం కుక్క వంశీ పిట్ట వినయ్ గాదాసి సతీష్ ఉమేష్ పలువురు పాల్గొన్నారు

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, ప్రతినిధి జూలై -22 అక్షరం న్యూస్**


ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ , జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓదెల మండల కేంద్రానికి చెందిన పి.విజయ లక్ష్మీ గ్రామ శివారులో సర్వే నెంబర్ 426 లో పట్టా భూమి లో మెగ్గు రమా దేవి చేపట్టిన అక్రమ నిర్మాణానికి ఇంటి నెంబర్ కేటాయించవద్దని, దానిని కూల్చివేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం పట్టణానికి చెందిన సిద్ది భీమయ్య జంగాలపల్లి గ్రామం సర్వే నెంబర్ 218 లో 16 గుంటల తన భూమిలో బాదె సాంబయ్య అనే వ్యక్తి బాత్ రూమ్ నిర్మించు కున్నాడని, దానిని పూర్తిగా కూల్చివేసి భూమి కబ్జాకు గురికాకుండా కాపాడాలని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు రామగుండానికి చెందిన జి.నాగలక్ష్మీ తన భర్త 02 ఏప్రిల్ 2020న మరణించాడని, తన భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పటి వరకు రాలేదని, దీని వల్ల తనకు వితంతువు పెన్షన్ రావడం లేదని, తనకు వెంటనే తన భర్త డెత్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలైన గృహ జ్యోతి, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ లబ్ధి చేకూరని అర్హులు ఎవరైనా ఉంటే గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదుతో ప్రజా పాలన సేవా కేంద్రం ద్వారా తమ దరఖాస్తులు సమర్పించవచ్చని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

**ప్రజలకు మెరుగైన సత్వర వైద్య సేవలు అందించాలి**

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**





**మహబూబాబాద్ /గార్ల /జులై 22/అక్షరం న్యూస్...**

మహబూబాబాద్ జిల్లా ప్రజావాణి కార్యక్రమం తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఆర్డిఓ నరసింహారావు, సంబంధిత అధికారులతో కలిసి (గ్రీవెన్స్) నిర్వహించారు .తొర్రూరు డివిజన్ పరిధిలోని వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరిస్తూ సంబధిత శాఖల అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.తొర్రూరు మండలం, అమ్మపురం గ్రామానికి చెందిన చింతకుంట్ల విజయ, తమ వ్యవసాయ భూమి సర్వే నెంబర్లు తప్పుగా పడ్డాయని వాటిని సరి చేయాల్సిందిగా దరఖాస్తు చేశారు,తొర్రూరు గ్రామం, మండలం కు చెందిన సర్వే బిక్షపతి, తమ యొక్క భూమి రికార్డులలో తక్కువగా నమోదు అయినందున సర్వే చేసి సరి చేయగలరని దరఖాస్తు చేశారు,వంతడుపుల గ్రామం, నరసింహుల పేట మండలం, కు చెందిన ఐనాల వెంకటనర్సు, తమభూమి ఎస్సారెస్పీ కాల్వ క్రింద పోయిందని ఇప్పటివరకు నష్టపరిహారం డబ్బులు రాలేదని ఇప్పించుటకు దరఖాస్తు చేశారు, మున్సిపల్ చైర్ పర్సన్ మంగళ పెల్లి రామచంద్రయ్య, తొర్రూరు పట్టణ ప్రజల సౌకర్యార్థం డంపింగ్ యార్డ్ కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించుటకు దరఖాస్తు చేశారు.తొర్రూరు డివిజన్ పరిధిలో పూర్తయిన రెండు పడకల గదుల ను కేటాయించి, అసంపూర్తిగా ఉన్న ఇండ్లను వెంటనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని తొర్రూరు జడ్పిటిసి మంగళపెల్లి శ్రీనివాస్, దరఖాస్తు చేశారు. అధికముగా భూ సమస్యల పరిష్కారం నిమిత్తం దరఖాస్తులు వచ్చాయని, మొత్తం కలిపి (50) దరఖాస్తులు ఈ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చాయని, అట్టి దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.అనంతరం శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు, తొర్రూర్ పురపాలక సంఘం పరిధిలో అంతర్గత పనులు, సానిటేషన్, బిల్డింగ్ పర్మిషన్, పన్నుల వసూలు, పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలనీ ప్రతివారం మున్సిపల్ పరిధిలో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలో వ్యవసాయ శాఖ అప్రమత్తంగా ఉంటూ నిత్యం ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేయాలని, రైతు రుణమాఫీ పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం తొర్రూరు ఏరియా హాస్పిటల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, హాస్పిటల్ పరిధిలో విష జ్వరాలు, సీజనల్ వ్యాధుల గురించి ఆరా తీశారు, ఓపి పేషెంట్లకు అందిస్తున్న సేవల గురించి స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ లోని ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెంట్స్ వార్డ్స్, ఫార్మసీ, లను స్వయంగా పరిశీలించారు. ఏరియా హాస్పిటల్ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్స్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని, విధులలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రం తనిఖీ చేసి లబ్ధిదారులకు అందిస్తున్న సేవలు గురించి అక్కడికి వచ్చిన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సూచించిన పథకాల వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నరసింహారావు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎడిఎ శోభన్ బాబు, అన్ని విభాగాల డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ భవనం ఆధునీకరణ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-టాస్క్ భవన ల్యాబ్, క్లాస్ రూమ్ ఏర్పాటుకు చర్యలు**

**-టాస్క్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి భవన ఆధునీకరణ పనులు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, ప్రతినిధి జూలై -22 అక్షరం న్యూస్**

టాస్క్ భవనం ఆధునీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని , పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణం లోని టాస్క్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి టాస్క్ భవనం ఆధునీకరణ పనులను తనిఖీ చేశారు. పెద్దపల్లి టాస్క్ భవన ఆధునీకరణ పనులను ఆసాంతం పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతంచేయాలని సూచించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి టాస్క్ భవనంలో పూర్తి చేసిన ఫ్లోరింగ్, మెట్లకు వుడెన్ టైల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తర్వాత మంత్రి సమయం తీసుకుని టాస్క్ భవనాన్ని ప్రారంభించడం జరుగుతుందని, దీనికీ వీలుగా పెండింగ్ పనులను 5 రోజుల లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. టాస్క్ కేంద్రంలో ల్యాబ్, క్లాస్ రూమ్ ఏర్పాటుకు అవసరమైన ఫర్నిచర్ సిద్ధం చేయాలని, త్వరగా ల్యాబ్ , క్లాస్ రూమ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టాస్క్ మేనేజర్ కు సూచించారు. అనంతరం పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ మేనేజర్ గంగా ప్రసాద్, పి.ఆర్. - డి. ఈ. శంకరయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా పరిరక్షణకు అధిక నిధులు కేటాయించాలి

**ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణం చేపట్టాలి...**

**ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయాలి**

**ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తన సొంత నిధులతో ప్రహరీ నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కోరం**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అద్యక్షులు మాగం లోకేష్**



**మహబూబాబాద్ /గార్ల /జులై 22/అక్షరం న్యూస్...**

విద్యారంగానికి ఈ ఏడాది జులై 28 నుండి జరుగనునన్న బడ్జెట్లో సమావేశంలో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో స్థానిక ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కు వినతి పత్రం సమర్పించారు .ఈ సందర్భంగా మాగం లోకేష్ మాట్లాడుతూ,రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పరిరక్షణకు, ప్రభుత్వ విద్యా బలోపితం చేసే విధంగా నిధుల కేటాయింపులు ఉండాలాన్నారు, గత కెసిఆర్ ప్రభుత్వం 10 ఏళ్లుగా విద్యకు సరైన నిధులు కేటాయించలేదని, ఈ సంవత్సరం అయినా అధికంగా నిధులు కేటాయించాలని అన్నారు. అదేవిధంగా తెలంగాణ వివజన హామీల ప్రకారంగా రాష్ట్రంలో ప్రతి జిల్లాకు నవోదయ పాఠశాల, ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యాసంస్థలు తెలంగాణలో ఏర్పాటు చేయాల్సి ఉండగా చేయలేదని ఈ సంవత్సరమైనా ఆ దిశగా హామీల అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విద్యకు 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మద్యాహ్న భోజన పథకం అమలు చేసే విదంగా తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.గార్ల మండల కేంద్యంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు, మండల కేంద్యంలో ఎస్ ఎం హెచ్ హాస్టల్ ను ఏర్పాచేయాలని కోరారు.ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందిస్తూ, గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణం తన సొంత నిదులతో ఏర్పాటు చేస్తానని స్పష్టమైన హామి ఇచ్చారు.ఈ కార్యక్రంలో ఏఐఎస్ఎఫ్ కళాశాల కమిటి నాయకులు, శివ,సాయి, వేణు , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ బడ్జెట్లో సమావేశం లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి...

# ఎం. మహేష్ కుమార్ పి డి ఎస్ యు మండల కార్యదర్శి...

**మహబూబాబాద్ /గార్ల /జులై 22/అక్షరం న్యూస్...**

జులై 23 నుంచి జరగబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని పి డి ఎస్ యు గార్ల మండల కార్యదర్శి ఎం. మహేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలో జరిగిన పి డి ఎస్ యు మండల కార్యవర్గ సమావేశం లో మహేష్ కుమార్ మాట్లాడుతూ,విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకుండా గత ప్రభుత్వం అవలంబించిన విద్యార్థి వ్యతిరేక విధానాలు,ప్రజా వ్యతిరేక విదానాలనే అవలంబిస్తుందన్నారు. మాటలకే ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ ఆచరణలో ప్రజా పాలన అనేటువంటి దానికి పారదర్శకత చూపకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో అయిన విద్యారంగానికి 30% నిధులు కేటాయించి,చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం కాకుండా ఉండాలంటే సరిపడా నిధులు అవసరం ఉంటుందని,ఒకపక్క గురుకులాలకు పక్క భవనాలు లేక వర్షాకాలంలో అద్దె భవనాలలో గురుకుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఇప్పటికీ రాష్ట్రంలో 40 శాతం విద్యార్థులు మేనేజ్మెంట్ హాస్టల్లకు పక్క భవనాలు గాని, మంచినీటి సౌకర్యం గాని లేనటువంటి పరిస్థితి నెలకొందని,దీనికి ప్రధాన కారణం అరకొర నిధులు కేటాయించి నిధులు లేక సౌకర్యాలు కల్పించకపోవడమే అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలపై పర్యవేక్షణ లోపంతో ఫుడ్ పాయిజిన్ అయి విద్యార్థులు ఇబ్బదులు పడుతున్నారన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు,విద్యార్థులపై లైంగిక దాడులు నిత్యం కొనసాగుతున్నాయని,వీటన్నిటిని పరిష్కరించాలంటే పూర్తిస్థాయిలో ఉన్నతాధికాలను నియమాకాలు జరగాలి అన్నారు.ఇవన్నీ కూడా రాష్ట్ర బడ్జెట్ కేటాయింపు పైనే ఆధారపడి ఉంటాయనే విషయాలన్నిటిని పరిగణలోకి తీసుకొని విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి విద్యార్థి యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్నికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగరాజ్, ఆకాష్, చింటూ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం

**పెద్దపల్లి ఎసిపి గజ్జి కృష్ణ.**

**రైల్వే స్టేషన్ బస్టాండ్‌లలోపోలీసుల తనిఖీలు**

**పెద్దపల్లి ప్రతినిధి జులై 23 అక్షరం న్యూస్**

పెద్దపల్లి జిల్లాలో గంజాయిఅక్రమ రవాణా, వినియోగంనియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ పెద్దపల్లి డీసీపీ చేతన ఆదేశాల మేరకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ పర్యవేక్షణ లో పెద్దపల్లి సిఐ కృష్ణ ఎస్సై లక్ష్మణరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఏసిపి కృష్ణ మాట్లాడుతూ.... పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో స్థానిక బస్టాండ్ లో యువత, ప్రజల ఆరోగ్యం ప్రాణాలకు హాని కలిగించే గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటిని అరికట్టడం, రవాణా, నియంత్రణ లో భాగంగా నార్కోటిక్ ట్రయినింగ్ స్నిఫర్ డాగ్ , స్పెషల్ పార్టీ సిబ్బంది తో ముమ్మరంగా జిల్లా కేంద్రంలో , పార్సెల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి పార్సిల్, రవాణా బ్యాగులను, ప్రయాణికుల బ్యాగ్ లను తనిఖీ చేయడం జరిగింది అన్నారు.



గంజాయి, డ్రగ్స్, ప్రభుత్వ నిషేధిత ఉత్పత్తుల రవాణాన, నియంత్రణ లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. మాధకద్రవ్యాలు రవాణా, విక్రయాలు, గంజాయి పంటలు సాగు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు...

# ఓబిసి డిక్లరేషన్ ప్రకటించాలని మండల తాహాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం




**కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా జూలై 22 అక్షరం న్యూస్:**

రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ పిలుపు మేరకు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ జిల్లా అధ్యక్షులు చేంద్రుపట్ల సునీల్ రెడ్డి గారి సూచన మేరకు బిజెపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న దానికి నిరసనగా మండల తాహాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీరిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు.గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారు.బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హెూదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరువ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్యకోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారు. సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపినట్టుగా అర్థమవుతుంది. ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదు. కామారెడ్డిలో ప్రకటించిన విధంగా ఓబిసి డిక్లరేషన్ ప్రక్రియ ప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించడం అయినది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు చిలువేరు సంపత్ కుమార్, దాసరి కృష్ణ, ఉమ్మనవేణ అనిల్, భూసారపు అజయ్, కిరణ్, అనంతుల నాగరాజు రాజు,చీర్లంచ తిరుపతి, పోగు లశ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

# ప్రమాదానికి బాధ్యులైన అధికారులను గుర్తించి కఠినంగా శిక్షించాలి

## -టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి

**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూలై 23 అక్షరం న్యూస్ :**

ఆర్జీ-3 డివిజన్ ఓసిపి2లో ఇటీవల జరిగిన ప్రమాదానికి బాధ్యులైన అధికారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఓసిపి2 గని పైటీబీజీకేఎస్ ఆర్ జి త్రీ ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గేటు మీటింగ్ లో మిరియాల రాజిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఒకే కుటుంబం, లక్ష్యసాధన అనే సూత్రం మర్చిపోయి కార్మికులు వేరు అధికారులు వేరు అనే నినాదానికి యాజమాన్యం తెరలేపిందని విమర్శించారు. ప్రమాదానికి రెండు రోజుల ముందుగా అదే దారి నుంచి వెళ్తున్న జీఎం, ప్రాజెక్టు ఆఫీసర్, మేనేజర్ ఇట్టి విషయాన్ని గమనించకపోగాపైపు లీకేజీ పనులలో ఇరుకైన గుంత తవ్వి అందులో పని చేయించడం మూలానే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఇరుకైన గొంతులో పనిచేయడం ఎంత మాత్రం శ్రేయస్సు కాదని అక్కడ పనిచేయడానికి వెళ్ళిన ఉప్పు వెంకటేశ్వర్లు తెలిపినప్పటికీ పెడచెవిన పెట్టిన అధికారులు ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పని సమయంలో రక్షణ చర్యలు పాటించని ఓసిపి టు యజమాన్యం ప్రమాదం జరిగిన తరువాత వారిని రక్షించే చర్యల్లోను కాలయాపన చేయడం మూలానే ఇద్దరు కార్మికులు మరణించారని అన్నారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపట్టిన పక్షంలో టీబీజీకేస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమాలు చేపట్టుతామని హెచ్చరించారు. ఈ గెట్ మీటింగ్ లో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, నాయకులు దేవ శ్రీనివాస్ పాశం




శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రావు, బొడ్డు వినయ్ కుమార్, గండి శీను, దాసరి మల్లేష్, రమేష్, సదానందం, రవి శంకర్, రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, గణేష్, సురేష్, సతీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో విధిగా పారిశుధ్య చర్యలు చేపట్టాలి...

-సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
-గ్రామాల్లో, పాఠశాల, వసతిగృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి
-మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి
-తరుచు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలి
-వర్షపు నీరు నిల్వ లేకుండా పంచాయతీ రాజ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
-గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి ఉపయోగించాలి
-తాగునిటీ స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలి
-ప్రభుత్వ శాఖల అధికారుల సమిష్టి కృషితో డయేరియా, డెంగ్యూ, మలేరియా కేసులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి...

డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ వైద్యాధికారి...



**మహబూబాబాద్ /గార్ల /జులై 22/అక్షరం న్యూస్...**

వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా, వాతావరణం లో వస్తున్న మార్పులకనుగుణంగా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా, ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో గార్ల మండలంలో ఎక్కడ కూడా డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి కేసులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ నోడల్ వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశానుసారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులతో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, కళాశాలలు, పాఠశాలలు, వాసతిగృహాలు, గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రత తీసుకోవాల్సిన జాగ్రతలపై అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, అన్ని విభాగాల అధికారులు సమన్వయం తో పనిచేయాలని, ఆరోగ్యపరమైన ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకోవస్తే వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. విష జ్వరాలు, మలేరియా, డయేరియా, డెంగ్యూ, వాంతులు, వీరేచనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో, పాఠశాలల్లో వంట మనుషులకు వంట నిర్వహణలో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి భోజన శాలలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు వేడి నీటిని తాగడం, స్వీయ పరిశుభ్రత ను పాటించడం పై అవగాహన, విస్తృత ప్రచారం చేయాలన్నారు. క్లాసు రూములో విద్యార్థులకు ఆరోగ్య విషయాలలో అవగాహనా కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, తహసీల్దార్ రవీందర్, ఎంపీఓ రజిని, ఏపీఎం నరేందర్, ఐ సి డి ఎస్ సంపూర్ణ, ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, రామచంద్రు, హిరలాల్, మాలోత్ శివ, వీరు నాయక్, సి హెచ్ ఓ, హెచ్ ఈ ఓ, సూపర్వైజర్లు ఇస్మాయిల్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

## విజ్ఞన్న యువసేన ఉదారత




**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**

పెద్దపల్లి పట్టణం లోని శాంతి నగర్ కి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఇళ్ళు ఇటీవల కురిసిన భారీ వర్షానికి కూలిపోగా విజయరమణారావు యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం వినోద్ రెడ్డి 50 కిలోల బియ్యం పంపిణి తో పాటు ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో బొంకురి కమల నాగమణి చోటు కుమార్ సతీష్ అహ్మద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు

# వికలాంగులకు ల్యాప్‌టాప్‌లను అందించిన ఎమ్మెల్యే




**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**

మహిళలు వికలాంగుల సంక్షేమ శాఖ వారి సహకారంతో సుల్తానాబాద్ పట్టణం శాంతినగర్ కి చెందిన చల్లా తిరుపతికి లాప్ ట్యాప్ మంజూరు కాగా వాటిని తిరుపతి సోమవారం రోజున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖ సభ్యులతో కలిసి ల్యాప్ ట్యాప్ ను అందించారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో మహిళలు వికలాంగుల సంక్షేమ శాఖ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ ఎస్సీ కమిషన్ వడ్డేపల్లి రాంచందర్‌ని కలిసిన నాగినేని జగదీశ్వర్ రావు

**పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్**



ఢిల్లీ నుండి గోదావరిఖని విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ ని మంథని నియోజకవర్గ బిజెపి పార్టీ నాయకులు నాగినేని జగదీశ్వరరావు సోమవారం రోజున గోదావరిఖనిలోని ఎన్టిపిసి గెస్ట్ హౌస్ లో రాంచందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అనంతరం మంథని నియోజకవర్గంకు సంబంధించిన పలు అంశాలను తనకు తెలియజేయడం జరిగిందని దానికి రామచందర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు

# నిజాయితీ చాటుకున్న మహిళ




**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 23 అక్షరం న్యూస్:**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన నీర్ల విజయ అనే మహిళ 80 వేల రూపాయల విలువ గల ఫోన్ రామగిరి ఎస్సై సందీప్ కు అప్పగించి నిజాయితీ చాటుకుంది. వివరాలకు వెళ్తే కల్వచర్ల గ్రామానికి చెందిన చెలు పూరి రాజమౌళి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో తన జేబు నుండి ఆపిల్ ఫోన్ పడిపోయింది అది విజయకు దొరకగా దాన్ని స్థానిక ఎస్సై సందీప్ సమక్షంలో రాజమౌళికి అందజేయడం జరిగింది. కాగా సెల్ఫోన్ అప్పగించిన విజయ ను ఉమ్మడి కమాన్ పూర్ మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి ఎస్సై సందీప్ లో మహిళను అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై. బెల్ట్ లు బహుకరించిన ఆలేరు మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్.



**నాగర్ కర్నూల్ జిల్లా/తెలకపల్లి/ జూలై 22(అక్షరం న్యూస్)**

ప్రభుత్వం మరియు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలోరాణించాలని ఆలేరు మాజీ ఉపసర్పంచ్ పి. కరుణాకర్ అన్నారు.సోమవారం మండల పరిధిలోని ఆలేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే175 మంది విద్యార్థులకు పదివేల రూపాయల విలువ గల టై మరియు బెల్టులను విద్యార్థులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంది తన వంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. అనంతరం దాత మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి నరహరి, మాజీ ఎస్ యం సి చైర్మన్ నిరంజన్. వెంకటయ్య. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్1 విద్యార్థులకు టై, బెల్టులను పంపిణీ చేస్తున్న దాత మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్.

# గార్ల సిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి

**మహబూబాబాద్ /గార్ల /జులై 22/అక్షరం న్యూస్...**

మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్దానిక సిహెచ్ సి ఆసుపత్రి లో పూర్తి స్దాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం మూలంగా ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే ప్రభుత్వం స్పందించి ఇందుకు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకోని పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని సీపీఎం పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కు సిపిఎం మండల కమిటీ అధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం గార్ల మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, ఐద్వా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత, సీపీఎం, ఐద్వా మండల నాయకులు పాల్గొన్నారు.



# ఎన్‌టిపిసి నిర్వహించే యాష్ టెండర్‌ని అడ్డుకుంటాం

## అసిఫ్ పాషా ఎన్‌టిపిసి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు

**జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**



ఎన్. టి. పి.సి రామగుండం, తెలంగాణ పవర్ ప్లాంట్ సంయుక్తం గా ఎం. ఎస్. టి. సి. ద్వారా ఈ నెల 24 న ఎల్కలపల్లి,కుందనపల్లి యాష్ చెరువులకి నిర్వహించే టెండర్ లో ఎవరు పాల్గొనవద్దని ఎన్ టి పి సి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అసిఫ్ పాషా కోరారు.గతం లో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఎల్కలపల్లి చెరువులో ఎన్ టి పి సి యాజమాన్యం బూడిది తరలించి ప్రస్తుతం బూడిద తొలగింపు కి టెండర్ నిర్వహిస్తుంది. ఎల్కలపల్లి చెరువు కాలుష్య కోరల్లో మరో కుందనపల్లి కావద్దు అనే ఉద్దేశ్యం తో వారు టెండర్ నిలిపి వేయాలని ఎన్ టి పి సి యాజమాన్యాన్ని కోరుతునట్లు తెలిపారు. యాజమాన్యం టెండర్ లు నిర్వహిస్తే అడ్డుకుంటారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు

# ఉపాధ్యాయురాలిను సన్మానించిన తాజా మాజీ సర్పంచ్



**రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జులై 23 అక్షరం న్యూస్ :**

రామగిరి మండలంలోని పన్నూరు ప్రైమరీ పాఠశాలకు నూతనంగా నియామకమైన ఉపాధ్యాయురాలు లను, అలాగే ఇంతకుముందు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు సంధ్య రాణిని తాజా మాజీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిసి కాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా..

**మంత్రి ధనసరి సీతక్క..**



ములుగు జిల్లా ప్రతినిధి, నూగూరు వెంకటాపురం/జూలై 22/అక్షరం న్యూస్:-

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి, ఏజెన్సీ ప్రాంత విద్యాభివృద్ధికి,కృషి చేస్తానని పంచాయతీరాజ్,స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూర్య(సీతక్క)అన్నారు.సోమ వారం వాజేడు,వెంకటాపురం మండలాలలో విస్తృత పర్యటన చేశారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మించబడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని సందర్శించారు.కళాశాల అధ్యాపక బృందం మరియు జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ,విద్యార్థులు సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళా శాలను ప్రారంభించారు.తదుపరి విద్యార్థినీ, విద్యార్థులను ఆప్యాయతతో పలకరించి వారితో ముచ్చటించారు.కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కళాశాల నిర్వహణకు కావలసిన సామాగ్రిని అందించాలని అధ్యాయక బృందం సీతక్క దృష్టికి తీసుకువెళ్లారు.ఐటిడిఏ పిఓ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి ప్రత్యేక నిధు లను కేటాయింప జేసి త్వరలోనే పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.అనంతరం జిల్లా పరిషత్ ప్రాథ మికోన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు.ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపా ధ్యాయులు అంకిత భావంతో విద్యార్థులకు మెరు గైనవిద్యను అందించాలని సూచించారు. పాఠశాలలో సమస్యలుంటే తమ దృష్టికి తీసు కురావాలని కోరారు.మంత్రి హోదాలో మొదటి సారిగా ఏజెన్సీ ప్రాంతానికి విచ్చేసిన సీతక్క పర్యటన ఎస్సై కొప్పుల తిరుపతి ఆధ్వర్యంలో ఆద్యంతం రక్షణ ఏర్పాట్ల మధ్య కొనసాగింది. పర్యటనలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా,మండల తహశీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీడీవో గొట్టం రాజేంద్రప్రసాద్,ఎంపీఓ హను మంతరావు,వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి గగ్గూరి ప్రవీణ్,జిల్లా కాంగ్రెస్ నాయ కులు చిడెం మోహనరావు,చిడెం సాంబశివ రావు,మన్యం సునీల్ బాబు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్,మండల నాయ కులు రమేష్,బేతంచర్ల గోవిందు,గార్లపాటి రవి, మహిళా నాయకురాల్లు సీతాదేవి,తాటి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ధ్యాన ఆత్మజ్ఞాన ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ ఎన్ టి పి సి కృష్ణ నగర్ లోని అమ్మ అపార్ట్మెంట్లో సోమవారం ఉచిత ధ్యాన ఆత్మజ్ఞాన ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రమాదేవి మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణ తరగతులను శివ మాస్టర్ బోధించారు. భూమి మీదకి ఆత్మ ఎలా వచ్చింది అనే అంశంపై శివ మాస్టర్ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి ఎన్ మాధవి కంగర్ల రాజ్యలక్ష్మి మంజుల నీలిమ వసంత జగదీష్ ఎన్ శ్రీనివాస్ సాగర్ మాస్టర్లు పాల్గొన్నారు.

## హమాలి కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలి



ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్.

నాగర్ కర్నూల్ జూలై 22(అక్షరం న్యూస్)

నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని లిక్కర్ గోదాం లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు ఈఎస్ఐ ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించి బీర్ బాటిల్ పేలి కాళ్లకు గాయాలు కాకుండా సంవత్సరానికి రెండు జతల షూ ఇవ్వాలని

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న మద్యం గోదాం హమాలీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయలని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం అనేక అలుపెరుగని పోరాటాలు నిర్వహించి స్వతంత్రానికి ముందే అనేక కార్మిక చట్టాలను సాధించడం జరిగింది. భారతదేశంలో కార్మిక చట్టాలు అమలు కావడానికి కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం అమలు కావడానికి ఏఐటియుసి నిర్విరామ పోరాటాలు నిర్వహించిందని అన్నారు. స్వాతంత్రనంతరం భారతదేశంలో కార్మిక చట్టాల అమలు, కార్మిక హక్కుల కోసం పోరాడి అనేక చట్టాలను సాధించిన ఘన చరిత్రకి ఉందని అన్నారు. ప్రస్తుత కేంద్ర బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా భారతదేశంలో అనేక చట్టాలను మార్చడానికి తీవ్రంగా ప్రయాణిస్తున్నది. అందులో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 48 చట్టాలను మార్చి యజమానులకు బడా పరిస్రామిక వేత్తలకు అనుకూలంగా ఉండే పద్ధతుల్లో 4 కోడులను, తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది. దానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు ఏఐటియుసి ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం రైతు చట్టాలను ఎలా అయితే వెనక్కి తీసుకున్నదో కార్మిక చట్టాలను కూడా వెనక్కి తీసుకునేదాకా ఏఐటీయూసీ విశ్రమించకుండా పోరాడుతుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా ఏఐటియుసి అనేక పోరాటాల నిర్వహించిందన్నారు. అన్ని రంగాల కార్మికులకు పని భద్రత, కల్పించాలని అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల అన్ని సంక్షేమ పథకాలు అందే వరకు వారి పక్షాన నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్యం గోదాం హమాలీ కార్మికులు వెంకటయ్య ఆంజనేయులు, కృష్ణ, మధు, సి బాలయ్య, పి రాజు, ఉదయ్, నాగరాజు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎనుపోతుల చిన్న కురుమయ్య మేస్త్రి,శ్రీనివాసులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు,

## పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది: పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.,



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో ఏఎస్ఐ గా పనిచేస్తూ ఎస్ఐ గా పదోన్నతి పొందిన 07 మంది, హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తు ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన 06 మంది, కానిస్టేబుల్ గా పని చేస్తూ హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతులు పొందిన 16 మందిని సిబ్బందిని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఐపిఎస్.,(ఐజి) వారి కార్యాలయంలో అభినందించి వారి వారి ర్యాంక్ ల వారిగా పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.... పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ గారు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, ఏ ఓ అశోక్ కుమార్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, మధు లు సూపరిండెంట్స్ ఇంద్రసేనారెడ్డి సందీప్, మనోజ్ కుమార్, సంధ్య,లు, సిసి గౌస్ , రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం పాల్గొన్నారు.

## మడిపెల్లి మల్లేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల పిల్లలకు నోట్ బుక్స్ అందజేసిన అసం పల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దైవ సమానులైన పిల్లలకు సహాయం చేయడం దైవకార్యంతో సమానమని రామగుండం ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య అన్నారు.రామగుండం కార్పొరేషన్ రెండవ డివిజన్ ఎన్టీపీసీ పీకే రామయ్య కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థిని, విద్యార్థులకు అసంపెల్లి లక్ష్మి ఫౌండేషన్ ఛైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) సహకారంతో, సేవ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య హాజరై విద్యార్థిని,విద్యార్థులకు బుక్స్ ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులైన వీరికి సహాయం చేయాలన్న ఆలోచన వచ్చిన ఫౌండేషన్ చైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్ దన్యులని అన్నారు. మట్టిలో మాణిక్యాలైన పేద విద్యార్థుల నుండే భవిష్యత్తు తరాల ఆశాకిరణాలు పుట్టుకొస్తారని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు మంచి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు సంధ్య , వాణి, ప్రశాంత్, పావని ,జుల రవి తదితరులు పాల్గొన్నారు..

## నేడు ఉచిత కంటి వైద్య శిభిరం




పెద్దపల్లి టౌన్ జూలై 22 అక్షరం న్యూస్

లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో పెద్దపల్లి జెండా చౌరస్తా వద్ద గల అమర్చంద్ కళ్యాణ మండపంలో తేది 23-07-2024 రోజున ఉదయం 10-00 గంటల నుండి మధ్యాహ్నం 1-00 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిభిరం ఏర్పాటు చేయబడినది ఇట్టి శిభిరం ద్వారా ఉచిత కంటి ఆపరేషన్ లు చేయించబడునని కంటి చూపు మందగించిన వృద్దులకు కంటిపై పొర వచ్చిన వారికి ఇట్టి విషయాన్నీ తెలియజేసి తేది 23-07-2024 నాటి క్యాంపు కి పంపించగలరని తెలిపారు ఆపరేషన్ అవసరం ఉన్న వారిని 23-07-2024 నాడే బస్సులో రేకుర్తి హాస్పిటల్ కి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేపించి మళ్ళీ బస్సులో పెద్దపల్లి లో డ్రాప్ చేయగలము అని తెలిపారు ఇట్టి విషయాన్నీ పెద్దపల్లి పట్టణం మరియు పరిసర మండలాలు గ్రామాలలోని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఇట్టి అవకాశన్ని వినియోగించుకునేలా చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని పాలకుర్తి ఎమ్మార్వో కు బిజెపి నాయకుల పత్రం



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బిజెపి ఇచ్చిన పిలుపు మేరకు రామగుండం నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కందుల సంధ్యారాణి ఆదేశాల మేరకు పాలకుర్తి మండలం లిబిజెపిలి నాయకులు మండల రెవెన్యూ అధికారి కి సోమవారం వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు నెలలోపు లిబిసి డిక్లరేషన్లి అమలు చేసి లిబీసీలకులి తగిన నిధులు కేటాయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు గెలిచి ఏడు నెలలు కావస్తున్న ఇప్పటికీ బీసీ డిక్లరేషన్ను అమలు చేయక కాలయాపన చేస్తున్నారు అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జరపడానికి ప్రయత్నం చేస్తున్నారు ఇది గనుక జరుగుతే బీసీలకు జనాభా తగిన రిజర్వేషన్లు లభించక చాలా నష్టం జరుగుతుంది కనుక బీసీ డిక్లరేషన్ అమలు చేసిన తర్వాత మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు జరపవలసిందిగా లిబిజెపిలి పాలకుర్తి మండల నాయకులు డిమాండ్ చేస్తున్నారు ఇ కార్యక్రమంలో బాల్సాని మల్లేశం. తిప్పని రాజకుమార్.కడారి నరసయ్య. నగేష్ . గోపు రామన్న కొలిపాక శంకరయ్య. కోడూరి శంకర్ . గట్టయ్య .జట్పాట్ తిరుపతి. కుమార్. శ్రీనివాస్. సాగర్ తదితరులు పాల్గొన్నారు

## రామగుండంలో ఘనంగా ఎన్సీపీ పార్టీ జాతీయ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు...



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పట్టణం తబిత ఆశ్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్సీపీ పార్టీ జాతీయ అధ్యక్షులు అజిత్ పవార్ 65 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటగా కేక్ కట్ చేసి, పిల్లలకు కేకు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం తబిత ఆశ్రమంలోని పిల్లలకు నోట్ పుస్తకాలు , పెన్నులు వితరణ చేశారు. ఈ సందర్భంగా మేకల శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ " నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ గారి 65వ జన్మదినం సందర్భంగా ఈరోజు తబిత అనాథ ఆశ్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగినదని, భవిష్యత్తులో అజిత్ పవార్ గారు ఆయురారోగ్యాలతో, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, రాబోవు కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఎన్సీపీ పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్, సంకె రాజేష్, గర్రెపెల్లి పరుశురాం గౌడ్, సుంకె నరేష్, రాంపల్లి రామాచారి, నాగరాజు లతో పాటు తబిత ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ లు పాల్గొన్నారు.

## 46వ డివిజన్లో ఎన్టీఆర్ నగర్ లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్ పాతపల్లి ఎల్లయ్య ఆధ్వర్యంలో 46వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సమీపంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ అనిల్ కుమార్, పాత పెల్లి ఎల్లయ్య మహంకాళి స్వామి కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు , వివిధ విభాగాల అధ్యక్షులు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు లిఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గతంలో రెండు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడమైనదని గుర్తు చేస్తూ రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. ం

## బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది....-




కోడిపుంజుల జ్యోతి "పి.ఓ.డబ్ల్యు" జిల్లా అధ్యక్షురాలు

జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టీపీసీ ఆటోనగర్ లోని ఐఎఫ్టియు కార్యాలయంలో సోమవారం "ప్రగతిశీల మహిళా సంఘం ( పి.ఓ.డబ్ల్యు)" టౌన్ అధ్యక్షురాలు బి సరోజన అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది.ఈ జనరల్ బాడీ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి ముఖ్య వ్యక్తగా హాజరై మాట్లాడుతూ...కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళకు రక్షణ కరువైందని, లైంగిక వేధింపులు, హత్యలు, హత్యాచారాలు, గృహ హింస మరింత పెరిగాయని, స్త్రీ పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమబాగం కోసం గత అర్ధ శతాబ్దంలో పి.ఓ.డబ్ల్యూ అనేక పోరాటాలు నిర్వహించిందని, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టాల కోసం వాటి అమలు కోసం పి.ఓ.డబ్లు బలమైన పోరాటాలు చేసిందని తెలియజేశారు.

పేరుకు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ పార్లమెంటులో చట్టం చేసినా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, బిజెపి ప్రభుత్వం వచ్చాక స్త్రీలపై హింస, మతోన్మాదం పెరిగిపోయిందని, మహిళా మల్లాయోధుల పై బిజెపి ఎంపీ "బ్రీజ్ భూషణ్" వేధింపులకు పాల్పడ్డారని, లైంగిక వేధింపుల చట్టం ఉన్నప్పటికీ అతనిపై ఎలాంటి కేసులు నమోదు కాలేదని ఆ చట్ట అమలు కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు, బిల్కిస్ భానుపై సామూహిక హత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని విడుదల చేసి పరోక్షంగా బిజెపి పార్టీ సన్మానించిందని విమర్శించారు, మరొకవైపున భారత రాజ్యాంగ విరుద్ధంగా సి.ఏ.ఏ, ఎన్.ఆర్.సి, పౌర చట్టాలను తీసుకువచ్చి మత ఉన్మాదంతో వ్యవహరించిందని, ఒకే దేశం, ఒకే మతం, ఒకే జాతి పేరుతో భిన్నజాతుల, మతాల సమూహారమైన భారత జాతీయతకు స్ఫూర్తికి భిన్నంగా బిజెపి పార్టీ వ్యవహరించిందని ఆవేదన వ్యక్తం చేశారు, తిరిగి మహిళలపై మనువాదన్ని ఒక్కొక్కటిగా వారి హక్కులను హరిస్తూ అణిచివేస్తుందని దుయ్యబట్టారు, పితృ స్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూనే నేడు తమ హక్కుల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగే ఈనెల 28వ తారీఖున గోదావరిఖని ఐ.ఎఫ్.టి.యు కార్యాలయంలో జరిగే "జిల్లా మహాసభ" ను అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పి ఓ డబ్ల్యు నూతన కమిటీ అనంతరం పి.ఓ. డబ్ల్యు నూతన మండల కమిటీ ఈక్రింది విధంగా ఎన్నుకోవడం జరిగింది, అధ్యక్షులుగా అధ్యక్షురాలుగా బి సరోజినీ, ఉపాధ్యక్షులుగా ఎస్ రాయమల్లమ్మ, ప్రధాన కార్యదర్శిగా పి కవిత, సహాయ కార్యదర్శిగా కనుకలక్ష్మీ , కోశాధికారిగా రాధ , కార్యవర్గ సభ్యులు, డి శంకరమ్మ, స్వరూప, బి శివరంజని, పద్మ, మహేశ్వరి, పి లక్ష్మి. మొత్తం 11 మందితో కమిటీ వేయడం జరిగింది.

ఇంకా ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు శంకరమ్మ, లక్ష్మి,పద్మ, స్వరూప, సంధ్య, లావణ్య, మల్లేశ్వరి, కవిత లతో పాటు తదితరులు పాల్గొన్నారులి

## రైతు సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో జూలై 21న గోదావరిఖనిలో నిర్వహించిన రైతు సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సు నిర్వహించడానికి సింగరేణి కమ్యూనిటీ హాల్ ఇప్పించిన ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనప్రసాద్ కు, నాయకులు ధర్మపురికి, రైతు సదస్సుకు ముఖ్య వక్తలుగా వచ్చి రైతు సమస్యలు, వాటి పరిష్కారాలపై సందేశాన్ని ఇచ్చిన ఓయూ ప్రొఫెసర్ ఖాసీం, భారత్ బచావో వ్యవస్థాపకులు గాదే ఇన్నయ్య , పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తిరుపతయ్య, సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ కు, రైతులకు, ప్రజా సంఘాల నాయకులతోపాటు, హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలుపుతున్నానన్నారు. అందరిలో నేను ఒక్కడిని అని, అందరం కలిసి రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుదామని తెలిపారు. తెలంగాణ రైతు సమస్యల సాధన కొరకు అందరూ సహకరించాలని కోరారు.

## బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్), జూలై 22 :ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్ పురం యుగేందర్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్య క్షుడు పుప్పాల వేణుకుమార్, కావటి ముత్యాలు, మంద వెంకటేషం యాదవ్, దైతల రంజిత్, గాదె ఉపేందర్, బోల్ల రాజ్ కుమార్, ద్యావర రాజు, మల్కపురం శ్రీకాంత్, పొన్నాల అంజనేయులు, కట్ట రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



హనుమకొండ/భీమదేవరపల్లి/జూలై 22(అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులోని టీ స్టాల్ వద్ద ప్రధాన రహదారి పై బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో కిందపడి గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చల్లూరి రమేష్ (52) అనే వ్యక్తి మృతిచెందాడు. మృతుని భార్య వసంత పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు రమేష్ హసిన్ పర్తి శివారులోని ఎస్ఆర్ యూనివర్సిటీలో గత కొన్ని నెలలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 5 గంటలకు డ్యూటీకి వెళ్లాడు. బైక్ పై ఒక్కడే ఇంటివద్ద పని ఉందని సుమారు ఉదయం పది గంటలకు తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి శివారులోని టీస్టాల్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. నుదురు, ఎడమ భుజం, ముఖం భాగాలకు తీవ్ర గాయాలైయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

## ఆగస్టు 05 వరకు రైతు భీమాకు దరఖాస్తు చేసుకోవాలి



నల్గొండ /అడవిదేవులపల్లి/ జులై 22 / అక్షరం టౌన్ న్యూస్ :

రైతులు ఆగస్టు 05 తేదీ వరకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.సైదా తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త పట్టా దారు రైతులకు జూన్ 28 వరకు, పట్టాబుక్ వచ్చిన వారికి ఇంతవరకు రైతు బీమా చేసుకోని రైతులు మాత్రమే రైతు బీమా చేసుకోవాలని తెలిపారు.గతంలో భీమా చేసుకున్న రైతులు బీమాలో మార్పులు చేర్పులు,ఆధార్ లో లేదా నామిని చనిపోతే మార్పులు కొరకు మాత్రం చివరి తేది జూలై 30 వరకు సమయం ఉందని అన్నారు.కొత్తగా పాసుబుక్ వచ్చిన రైతులు మాత్రమే రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.దీనికోసం దరఖాస్తు ఫారం,రైతు పట్టా దారు పాస్ బుక్ లేదా జిరాక్స్ మండల తహసీల్దార్ తో డిజిటల్ సంతకం అయిన డీఎస్ పేపర్,రైతు ఆధార్ కార్డు జిరాక్స్,నామినీ ఆధార్ కార్డు, ఒకవేళ నామిని మైనర్ అయితే,అప్పాయి%శీ%టి మేజర్ అయి ఉండాలి వారి ఇద్దరివీ ఆధార్ కార్డు జిరాక్స్ లు ఏఈఓ సమక్షంలో దరఖాస్తు మీద సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు.14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకి అర్హులని అన్నారు.ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే భీమా చేసుకోవాలని తెలిపారు.ఈ అవకాశన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతరం తాహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో కరుణాకర్ రావు లు రుణమాఫీ గ్రీవెన్స్ పత్రాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో కరుణాకర్ రావు,మండల వ్యవసాయ అధికారి డి సైదా,సర్వేయర్ లక్ష్మణ్,ఏఈఓ లు మహేష్ నాయక్,రావుల నరేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపుకు గురైన ప్రాంతం ను సందర్శించిన డిసిపి

**బోటు నడిపిన డి. సి. పి మంచిర్యాల . ఎగ్గడి భాస్కర్ ,ౌ**

**లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలిలి**





జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

రామగుండం పోలీస్ కమీషనరేట్ మంచిర్యాల జోన్ చెన్నూరు రూరల్ నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేమనపల్లి మండలం లో గత 5 రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగి రచర్ల, మల్కలపేట మధ్య గల వంతెన మునిగిపోయింది. ప్రజలు అత్యవసర పరిస్థితులలో ప్రయాణం చేయలేక పోయారు. సమాచారం తెలిసిన రామగుండం పోలీస్ కమీషనర్ . శ్రీనివాస్ ఐ.పీ.ఎస్ (ఐజి) డిసిపి మంచిర్యాలకి రాచర్లకి జిల్లా పోలీసు రెస్క్యూ టీమ్ తో వెళ్లి అక్కడ ప్రజల పరిస్థితి చూసి వారికి సహాయం అందించామని తెలపగా డిసిపి భాస్కర్ గారు జైపూర్ ఎసిపి ఏ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ కలిసి రెస్క్యూ టీమ్ తో స్వయంగా బోటు నడిపి రాచర్ల మధ్య బ్రిడ్జి మునిగిపోయిన ప్రాంతానికి మరియు రహదారి దిగ్బంధం ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి, అక్కడి ప్రజలకు పోలీసుల ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని ధైర్యం నింపారు.

ఈ సందర్భంగా డిసిపి భాస్కర్ మాట్లాడుతూ ....వర్షం కారణంగా రహదారులన్ని జలమయమయ్యాయి. వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు రోడ్లపై ఉన్న గుంతలు నీటితో నిండి ఉండటం వలన రోడ్డు ప్రమాదాలకు గురి అయ్యా అవకాశం ఉందని, అత్యవసరమయితే తప్ప బయటకి రావద్దని జిల్లా డిసిపి ఏ.భాస్కర్ తెలిపారు.భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు వంకలు, చెరువులు,నదులు పొంగి ప్రవహిస్తున్నందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామం నుండి ఎప్పటికప్పుడు పరిస్థితిని గురించి సమాచారాన్ని సేకరించి అవసరమైతే అక్కడికి చేరుకొని ప్రజలకు అండగా ఉండాలని తెలియజేసారు. జిల్లాలోని ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఇతర శాఖలతో సమన్వయం పాటిస్తూ పోలీస్ యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదులను పొంగిపొర్లుతున్న చెరువులను, వాగులను చూడటానికి బయటికి వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్నవారు డయల్ 100నకు ఫోన్ చేసి పోలీసు వారి సేవలను వినియోగించుకోవాలని తెలియజేసారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఈనెల 26 న వేలాది మందిలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

హనుమకొండ/భీమదేవరపల్లి/జూలై 22(అక్షరం న్యూస్):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్న పేదలు నివసించేందుకు స్థలం అడుక్కునే దుస్థితి నెలకొందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. సోమవారం పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వందలాది మందితో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇండ్ల స్థలాలకు పట్టాలు, ఇండ్ల నిర్మాణం కోసం సహకరించాలని కోరుతూ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం అందజేసారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి హజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాలో అనేక భూ పోరాటాలు చేసి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వేలాది మంది పేదలు ఇండ్ల పట్టాలు, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బడుగు, బలహీన వర్గాల పేదలు నివాసాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల హామీలలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలంతో పాటు ఇండ్ల నిర్మాణ కోసం ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అమలు చేయకపోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈనెల 26న వేలాది మందితో జిల్లా కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు పాల్గొంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములలో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, తిరుపతి, ఆదరి రమేష్, తిరుపతి, కిషన్, మార్పు సంజీవరెడ్డి, పెద్ద సంఖ్యలో గుడిసెవాసులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా ఉన్న పాఠశాలను అంగన్వాడి కేంద్రానికి కేటాయించాలి



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఎన్టిపిసి సమీపంలో ని ఐదవ డివిజన్లో మల్కాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల గత కొంతకాలంగా నిరుపయో గంగా ఉంది.మల్కాపూర్ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను అంగన్వాడీ కేంద్రానికి కేటాయించి నూతన భవనాన్ని నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ రహీం సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ



జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) జులై 22 : లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ పూర్వ అధ్యక్షుడు, ప్రస్తుత జోన్ చైర్మన్ లయన్ కూరెళ్ళ ఉపేందర్ గుప్తా రెండవ కుమారుడు కూరెళ్ళ వినయ్ కుమార్ గుప్తా 38వజన్మదినం సందర్భంగా సోమవారం కూరెల్లి ఉపేందర్ సహకారంతో,క్లబ్ ఆధ్వర్యంలో రఘునాథ్ పల్లి బస్టాండ్ వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉపేందర్ గుప్తా సేవా తత్పరతను అయన కొనియాడారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 240 మంది పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన పలువురు వినయ్ కుమార్ గుప్తా కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రఘునాథపల్లి మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు జోన్ చైర్మన్ లయన్ కూరెళ్ళ ఉపేందర్ గుప్త మాట్లాడుతూ అన్నదానం చేయడం మహత్కార్యం అని వారి కుటుంబ సభ్యులు పుట్టిన రోజు సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు చెప్పట్టడం సంతోషంగా ఉందని అయన అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి రాజు గౌడ్ పూర్వ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, లక్ష్మణ్, వేదకుమార్, సురేష్, కర్ణాకర్, కడారి శ్రీనివాస్ , రహీం పాషా, అశోక్, బచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాగన్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవో ప్రకారం లేఖనాలు ఇవ్వాలని రైల్వే సీఐ కి వినతి పత్రం



జ్యోతి నగర్ జులై 22 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం రైల్వే వ్యాగీన్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు జీవోప్రకారంగా వేతనాలు అమలు చేయాలి. సౌత్ సెంట్రల్ రైల్వే రామగుండం డిపో వ్యాగన్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు కామదేను ట్రేడింగ్ కంపెనీ యందు విధులు నిర్వహిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ జీవో ప్రకారంగా ఆన్ స్కిల్డ్ కార్మికునికి రోజుకు రూ.522/ చెల్లించాల్సి ఉండగా రూ.350/ మాత్రమే చెల్లిస్తున్నాడు . చట్టబద్ధమైన పిఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయడం లేదు. బ్యాంక్ పేమెంట్స్ చేయాల్సి ఉండగా నేరుగా చేతికి ఇస్తున్నాడు.గత సంవత్సరం కాలంగా కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జీవోప్రకారంగా వేతనాలు చెల్లించేలా, ఈఎస్ఐ పిఎఫ్ అమలు జరిగేలా అలాగే పే స్లిప్స్ ఇవ్వాలని బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని రామగుండం రైల్వే కమర్షియల్ సిఐ కి సిఐటియు అనుబంధ తెలంగాణ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం రామాచారి ఉపాధ్యక్షులు ఎన్.భిక్షపతి,యూనియన్ ప్రధానకార్యదర్శి బొంకూరి మహేష్, ఏం ఏంఉపాధ్యక్షులు యాసిన్,పాల్గొన్నారు

## రైతు వేదికకు తాళం.. రైతుల పడిగాపులు



రైతు రుణమాఫీ సహాయ కేంద్రం ఎదుట ఆందోళన

హనుమకొండ/భీమదేవరపల్లి/జూలై 22(అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు రైతువేదికలో రైతు రుణమాఫీ సహాయ కేంద్రం ఏర్పాటు చేసారు. కాగా సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూడా తాళం తీయలేదని రైతులు అందోళన వ్యక్తం చేసారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా మహిళ కార్యదర్శి మంచాల రమాదేవి, నాయకులు తిరుపతి అక్కడకు చేరుకుని రైతులకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ జిల్లా, మండల వ్యవసాయ విస్తరణాధికారులకు ఫోన్ చేసిన స్పందన లేదని వారు ఆరోపించారు. రైతులు గంటల తరబడి రైతు వేదిక వద్ద అధికారుల కోసం వేచి చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. రుణమాఫీ పై అధికారులకు స్పష్టమైన సమాచారం లేదని, సమాచార లోపంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ పై ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

## రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి ఎండి. అఫ్జల్ పాషా



హనుమకొండ/భీమదేవరపల్లి/జూలై 22(అక్షరం న్యూస్):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎండి. అఫ్జల్ పాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పేర్లు ఎమైనా తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 30 వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే కొత్త పాస్ బుక్ లు పొందిన రైతులు పాస్ బుక్ ఆధార్ కార్డు,నామినీ ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారం తీసుకుని స్థానిక రైతు వేదికలో ఇవ్వాలని తెలిపారు. రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 5 వరకు చివరి తేదీ ఉందని తెలిపారు.

## కొలనూరు పాఠశాలలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్ శిక్షణ కార్యక్రమం



ఓదెల/ పెద్దపల్లి జులై 22(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని కొలనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు మొదటిరోజు విద్యార్థిని విద్యార్థులు సప్తాహ్ లో భాగంగా మొదటి రోజు విద్యార్థులచే బోధనాభ్యాసం ప్రక్రియ సులభతరం చేసే పరికరాలను టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేసి చూపించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏసుదాస్ మాట్లాడుతూ పిల్లలకు సులభతరమయ్యే మెటీరియల్ తయారు చేయడంలో ఎంతో ఉత్సాహం చెబుతున్నారని అందరూ ఉత్సాహంగా పాల్గొని వివిధ విషయాలలో ప్రతిపనం కనబరుస్తున్నారని అన్నారు.పాఠశాల సిబ్బంది పర్యవేక్షణ అధికారి విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలి





ములుగు జిల్లా ప్రతినిధి/జూలై 22/అక్షరం న్యూస్:-

ఏటూరునాగారం మండలం లోని కొండాయి మల్యాల,దొడ్ల గోవిందరాజుల కాలని,కొత్తూరు గ్రామంలోని ఏజెన్సీ ప్రజలు వరదలు సంభ వించినప్పుడల్లా ప్రాణాలను అరచేతిలో పెట్టు కుని దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని అంబేద్కర్ విగ్రహప్రతిష్టాత్మక కమిటీ చైర్మన్ పరికి ప్రసాద్ అన్నారు.ఆయా గ్రామాల ప్రజా సమస్యలపై పత్రికాప్రకటన సోమవారం విడుదల చేశారు.కొండాయి గ్రామంలో సమా చారవ్యవస్థ టవర్నిర్మాణం జరిపినప్పటికీ వినియోగంలోకి తీసుకురావడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సమాచారవ్యవస్థ లేకపోవడంవల్ల గత సంవ త్సరం జూలై నెలలో సంభవించిన వరదల్లో 9మంది జల సమాధి అయిన విషయాన్ని గుర్తు చేశారు.వెంటనే ప్రభుత్వం సమాచార వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం మూడు గ్రామాలకు రవాణా సౌక ర్యాన్ని,సమాచార వ్యవస్థను అందించడంలో పూర్తిస్థాయిలో విఫలమైందని విమర్శించారు. మూడు గ్రామాల్లో నివసిస్తున్న కుటుంబాలు మట్టి గోడలతో నిర్మించుకున్న ఇండ్లు కూలిపోతే గత ప్రభుత్వ ఏ ఒక్క కుటుంబానికి పక్కా ఇంటిని మంజూరు చేయలేదన్నారు.జంపన్న వాగు పొంగితే గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయి కూరగాయలు దొరకని పరిస్థితి ఉంద న్నారు.కొండాయి గ్రామప్రజల కు మైదాన ప్రాంతంలో శాశ్వత నివాసాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని గ్రామస్తులకు మర పడవల ను అందుబాటులో ఉంచి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.కార్యక్రమంలో అంబేద్కర్ ప్రతిష్టాత్మక విగ్రహ కమిటీ గౌరవ సలహాదారులు పరికి బిక్షపతి,పరికి నరసింగ రావు,కోకిల సాంబ య్య, తిప్పనపల్లి రవీందర్, మందపల్లి సాగర్,వాసంపల్లి రవితేజ,పాడిదల మహేం దర్, కోయిల రాజు,మాదరి కోటేష్, కార్మికుల సుధాకర్,తదితరులు పాల్గొన్నారు.

# కోమల్ల ప్రధానోపాధ్యాయుడిని తక్షణమే బదిలీ చేయాలి



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్,) జూలై 22: ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న మండలంలోని కోమల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నర్సింహులును తక్షణమే బదిలీ చేయాలని కోరుతూ కోమల్ల గ్రామస్థులు, విద్యార ల తల్లిదండ్రులు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో తాటికొండ వెంకటేష్ యాదవ్. బొల్లపల్లి కుమార్, బంద కుమారస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని తాసిల్దార్ కి వినతి పత్రం



ఓదెల/ పెద్దపల్లి జులై 22(అక్షరం న్యూస్)

సోమవారం బిజెపి మండల అధ్యక్షులు మాజీ కొలనూరు ఎంపీటీసీ కారంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా నాయకుల పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని స్థానిక తాసిల్దార్ బి యాకన్నకు వినతిపత్రం ఇచ్చారుఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న దానికి నిరసన కార్యక్రమం నిర్వహించి పలు అంశాలపై తాసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఈ నేపథ్యంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు కింది పలు హామీలను ఇచ్చారని

. కాంగ్రెస్ పార్టీ : ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారని స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారని అదేవిధంగా

. గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారని బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హొదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు

ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు ఇంతవరకు చేయలేదని. బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, ఎలాంటి పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. అని అన్నారుఅదేవిధంగా. బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారని అన్నారు అదేవిధంగా సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు కు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపినట్టుగా అర్థమవుతుంది. అని. ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదు.. అని అన్నారుఅందుకే ఈ విషయాలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం తో పాటు వినతిపత్రం ఇవ్వడం కూడా జరిగిందనిప్రభుత్వం వెంటనే వారం రోజుల్లో పై విషయాల పైన చర్యలు ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్లలో ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఓదెల మండలం అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్, దళిత మోర్చా మండల అధ్యక్షులు సకినాల కృష్ణ, బీసీ మోర్చా మండల అధ్యక్షులు, పేరవేణి సతీష్, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఇరవేణి అనిల్ రావ్, రామినేని రాజేంద్రప్రసాద్, రాచర్ల అశోక్, కారంగుల నవీన్, దేవరకొండ అరవింద్, తాళ్లపల్లి శివ, మేకల నిఖిల్ యాదవ్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి : ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆషాడ మాసం బోనాల పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వినాయక నగర్ బస్తీలో బండ శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పలారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి : బీజేపీ నాయకులు



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓట్ల కోసమే కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ హామీ ఇచ్చారని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్ కుమార్ గౌడ్, మణికొండ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్పలు ఆరోపించారు. బీసీ డిక్లరేషన్ ఇప్పటికీ అమలు కాలేదని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ నార్సింగి ఓబిసి మోర్చా అధ్యక్షుడు అప్ప ఆధ్వర్యంలో సోమవారం గండిపేట్ మండల్ తాసిల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్దిదారుని అకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారన్నారు. బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్దమైన హెరీదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి రూ.20 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయంపైన ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదన్నారు. అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచీకత్తు లేకుండా రూ.పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షులు చిలుకూరి బీరప్ప, కౌన్సిలర్ వందన నాగేష్, పిఎస్ మల్లారెడ్డి, సత్యనారాయణ, సిద్ధప్ప, మెండే నాగేష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# బీజేఎంసీ హైదర్‌షాకోట్ ప్రభుత్వ పాఠశాలలో హై స్కూల్ నిర్మాణ్ సంస్థ హ్యాండ్ వాష్, వాష్‌రూంల ఏర్పాటు




రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగీర్ మున్సిపాల్ కార్పొరేషన్ లో హైదర్‌షాకోట్ హైస్కూల్ లో నిర్మాణ్ సంస్థ వారు హ్యాండ్ వాష్, వాష్‌రూంలు, ఆడిటోరియంలు నిర్మించడానికి ముందుకు వచ్చిన డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మాణ్ సంస్థ హ్యాండ్ వాష్, వాష్‌రూంలు, ఆడిటోరియం నిర్మించడానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టింకు రెడ్డి పాల్గొన్నారు.

## బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన ముఠా అరెస్ట్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : తెలంగాణ లీగల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధుల ముసుగులో ఓ పాఠశాల యాజమాన్యాన్ని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు కసు నమోదు చేసుకొని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ హై స్కూల్ కు ఈ నెల 18వ తేదీన కొంతమంది విద్యార్థి సంఘం నాయకులం అంటూ వచ్చి నానా హంగామా చేశారు. స్కూల్ యాజమాన్యాన్ని బుక్స్ అమ్ముతున్నారు, ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నారు, మీ టర్నోవర్ ఎంత ఉంటుంది అంటూ రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. దాదాపు రెండు మూడు గంటల పాటు సినీ ఫకీలు ఈ ముఠాలోని సభ్యులు ఆ స్కూల్లో విద్యార్థులను ఉపాధ్యాయులను యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం తరపున పలువురు పాఠశాలల కరస్పాండెంట్లు హుటాహుటిన అక్కడికి చేరుకోవడం జరిగింది. వారిని చూసి నిందితులు పారిపోయారు. పాఠశాల యాజమాన్యంతో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు అదే రోజు మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ సత్యకుమార్ వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి బెదిరింపులకు గురి చేసి డబ్బు డిమాండ్ చేసిన 13 మందిలో ఐదు మందిని సోమవారం గుర్తించి అరెస్టు చేశారు. మిగతా వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో తెలంగాణ లీగల్ స్టూడెంట్ అసోసియేషన్ చైర్మన్ కార్తీక్ అలియాస్ బాలకోటీ, సందీప్, లక్ష్మీకాంత్ చారి, ప్రవీణ్ యాదవ్, ప్రణయ్ గౌడ్ తదితరులు ఉన్నారు. వీరితోపాటు పరారీలో ఉన్న మరో ఎనిమిది మందిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఇన్స్పెక్టర్ వెల్లడించారు. అరెస్టు చేసిన కార్తీక్ అలియాస్ బాలకోటి , సందీప్, లక్ష్మీకాంత్ చారి, ప్రవీణ్ యాదవ్, గౌడ్ లపై వివిధ సెక్షన్ల పై కేసులు నమోదు చేసి రిమాండ్ చేయనున్నట్టు వెల్లడించారు.

## బోనాల ఉత్సవాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు : కమిషనర్ శరత్‌చంద్ర



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : బోనాల ఉత్సవాల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పోరేషన్ కమిషనర్ బీ.శరత్‌చంద్ర అన్నారు. సోమవారం బోనాల ఉత్సవాల పురస్కరించుకొని, 14, 17 వ డివిజన్లలోని పీరంచెరువు ఓల్డ్ విలేజ్, వెంకటేశ్వర కాలనీలలో జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో రోడ్ల వెంట ఉన్న గడ్డి మొక్కలు, మట్టికుప్పలను తొలగింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేస్, సానిటరీ జవాన్లు సుభాష్, సురేష్, శ్రీధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి కే. రంజిత్ రెడ్డి

కరీంనగర్/ చిగురుమామిడి/జులై 22(అక్షరం న్యూస్ )

కొత్తగా పట్టాదారి పాసుబుక్ వచ్చిన రైతులు రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కేతిరెడ్డి రంజిత్ రెడ్డి సోమవారం తెలిపారు. కొత్తగా పట్టాదారి పాస్ బుక్ వచ్చిన రైతులు మాత్రమే రైతు బీమాకు(జూన్ 28 వరకు పట్టా పాస్ బుక్ లో వచ్చిన వారు) అర్హులు అని, రైతులు ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, రైతు బీమాకు దరఖాస్తులు చేసుకునేందుకు దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టా దారు పాస్ బుక్ (లేదా), తహసిల్దార్ తో డిజిటల్ సంతకం అయినా డిఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జత చేయాలన్నారు. నామిని మైనర్ అయితే అప్పాయింటి మేజర్ అయి ఉండాలని, వీరి ఇద్దరివీ ఆధార్ కార్డు జిరాక్స్ లు ఏఈఓ సమక్షంలో దరఖాస్తు మీద సంతకం చేసి ఇవ్వాలని తెలిపారు.14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే ఈ రైతు బీమాకి అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలని సూచించారు.గతంలో బీమా చేసుకున్నా రైతులు బీమాలో మార్పులు చేర్పులు, ఆధార్ లో లేదా నామిని చనిపోతే మార్పులు కొరకు మాత్రం జూలై 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## రహదారులు మూసివేత

ములుగు/నూగూరు వెంకటాపురం/జూలై 22/ అక్షరం న్యూస్:-

కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి గోదావరి నదికి వస్తున్న వరద నీటితో పరివాహక ప్రాంతాలలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.గోదావరి నది ఉధృతి వలన మండలంలోని కొండాపురం, వీరభద్రవరం గ్రామాల సమీపంలో గల జిన్నెల వాగు,కుక్కతోగు వాగుల వద్ద వెంకటాపురం-భద్రాచలం ప్రధాన రహదారి పైకి వరద నీరు వచ్చి చేరింది.వరద నీరు ప్రమాదకర స్థాయిలో రహదారుల పైకి చేరే అవకాశం ఉన్నందున తాత్కాలికంగా రాకపోకలు నిలిపి వేయడం జరిగింది.భద్రాచలం వెంకటాపురం,ఇరువైపులా రాకపోకలు సాగించే ప్రయాణికులు ఏటూరు నాగారం,మణుగూరు మీదుగా రాకపోకలు సాగించవలసినదిగా కోరుతూ..ఎస్సై కొప్పుల తిరుపతిరావు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.

## శోభాయానంగా రాధాకృష్ణ పుష్పయాగం



కుంకుమార్చన తో పతి ఆయుష్షు పెరిగి పత్నికి సౌభాగ్యం సిద్ధిస్తుంది.

నాగర్ కర్నూల్ జూలై 22(అక్షరం న్యూస్)

అమ్మవారిని కొలిచే వివిధ రూపాలలో భాగంగా కుంకుమార్చన ప్రత్యేకత ఉందని,కుంకుమార్చన, అమ్మవారిని చేయడంతో నిత్య పారాయణం చేయడంతో పతి యొక్క ఆయుష్ పెరిగి,పత్నికి సౌభాగ్యం సిద్ధిస్తుందని శ్రీ జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ వారు అన్నారు.83వ విశ్వశాంతి మహాయాగం శ్రీకాళచక్రం, అతి రుద్రం, ఆయుధ చండీ, చతుర్వేద పారాయణంలో భాగంగా నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో ఈనెల 7 నుండి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న యాగాలలో సోమవారం మహిళలచే నిర్వహించిన సామూహిక కుంకుమార్చన విశిష్టతను మహిళలకు ప్రత్యేకంగా తెలియజేశారు. సౌభాగ్యవతులు,మహిళలు, అమ్మవారిని విశేషంగా పారాయణం చేయుట, కొలవడం,స్మరణ చేయుట నిత్యం అలవాటు చేసుకోవాలన్నారు. తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్త సమయంలో ఉదయం 4:30 నుంచి 05:30 మధ్య , ప్రదోషకాల సమయంలోసాయంకాలం 5:30 నుంచి 6:30 మధ్య అమ్మ వారిని విశేషంగా దీపారాధనతో పూజించాలన్నారు.శ్రీ రాధాకృష్ణ పుష్పయాగంలో భక్తులు తమ ఇంటి వద్ద నుండి తీసుకువచ్చిన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పుష్పయాగ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా వేద బ్రాహ్మణులచే వేదమంత్ర చరణల మధ్య నిర్వహించారు.భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ వేద ఆశీర్వచనం తో పాటు ముత్యాల తలంబ్రాలు అందజేశారు.శ్రీకృష్ణుని వేషధారణలోని చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని బాజా భజంత్రీలు మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.పాల్గొన్న భక్తులందరూ జైశ్రీకృష్ణ, జైశ్రీకృష్ణ,జైశ్రీకృష్ణ ద్యానులతో స్మరించారు. భక్తులకు మధ్యాహ్నం రాత్రి వేళలో అల్పార వసతి అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడా మీకు జోహార్లు



ఓదెల/పెద్దపల్లి జులై 22 (అక్షరం న్యూస్)

ఓదెల మండలం జిలకుంట గ్రామానికి చెందిన సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరిమల్ల ఐలయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించకగా మృతుడు తెలంగాణ ఉద్యమకారుడి దశదినకర్మకు హాజరై మృతుడు చిత్రపటానికి ఘనంగా పూలమాలవే సి జోహార్లు అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్

ఈ కార్యక్రమంలో సురేష్ , ఐలయ్య , తిరుపతి , రవి , పుల్ల రెడ్డి , రవీందర్ రెడ్డి , బూర బాబు , రాములు , మల్లయ్య తదితరులు పాల్గొన్నారు...

## ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం : కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / జులై 22/ అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనుల్లో నాణ్యతే ప్రధానమని ఏడవ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. సోమవారం 7 వ డివిజన్ పరిధిలోని రాధానగర్ కాలనీ లో రూ.7 లక్షలు, నర్సారెడ్డి లో రూ.35 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అందరి సమస్యలను దశలవారిగా పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా తనకు దృష్టికి తీసుకురావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్ణ చంద్రా రెడ్డి, శ్రీధర్ గౌడ్, రవీంద్రరెడ్డి, వలీ, నరసింహ రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఇందుర్తి గ్రామంలో వర్షాల కు కూలిన ఇల్లు ప్రభుత్వం వ్యాదుకోవాలని విజ్ఞప్తి..



ఓదెల/ పెద్దపల్లి జులై 22(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన మల్యాల నాగభూషణం ఇల్లు కూలిపోయింది ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి వచ్చి చూసి పోయిన దాఖలాలు లేవని నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు గ్రామంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోడలు నాని ఇల్లు కూలిపోయిన సంఘటన ఇందుర్తి గ్రామంలోని నాగుల మల్యాల నాగభూషణం ఇల్లు పూర్తిగా కూలిపోయింది. సమయానికి ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. వర్షాల కారణంగా ఇల్లు కూలిపోవడంతో తమకు వేరే ఆధారం లేదని ప్రభుత్వంమే ఆదుకోవాలని వేడుకొన్నారు.

## పురుగు మందు సేవించి వ్యక్తి మృతి



ములుగు/నూగూరు వెంకటాపురం/జూలై 22/ అక్షరం న్యూస్:-

పురుగుమందు సేవించి మృతి చెందిన సంఘటన మండలం లోని వీరభద్రవరం గ్రామంలో చోటుచేసుకుంది.స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం...వీరభద్ర వరం గ్రామపంచాయతీలో కూలీగా పనిచేస్తున్న మునిగెల శ్రీనివాసరావు సోమవారం మధ్యాహ్నం సమయంలో పురుగుల మందు సేవించడంతో కుటుంబ సభ్యులు వెంటనే వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా మృతి చెందాడు.మృతుడు శ్రీనివాసరావు భార్య ముగ్గురు పిల్లలను కలిగి ఉన్నట్లు పేర్కొ న్నారు.మృతుడి కుమారుడు నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విలేకరులకు తెలిపారు.

## రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి ఏవో రాంబాబు



ఓదెల/ పెద్దపల్లి జులై 22(అక్షరం న్యూస్) ఓదెల మండలంలోని గుంపుల క్లస్టర్ పరిధిలో గల గ్రామాలు పెందుర్తి గుంపుల గూడెం గ్రామాల రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు తెలిపారు రైతు బీమా చేసుకున్న రైతులు ఏదైనా మార్పులు చేసుకోవాలనుకుంటే జులై 30 వరకు అవకాశం ఉందన్నారు కొత్తగా పట్టా పొందిన రైతులు ఆగస్టు ఐదు వరకు దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటనలో వ్యవసాయ అధికారి రాంబాబు తెలియజేశారు

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



కోహెడ/సిద్దిపేట,జూలై 22(అక్షరం న్యూస్)కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసనగా బిజెపి రాష్ట్ర ఓబీసీమోర్చా కమిటీ పిలుపుమేరకు కోహెడ మండల బిజెపి ఓబీసీ మోర్చా నేతృత్వంలో డిప్యూటీ తహిసిల్దార్ ఎర్ర దేవేంద్రకి బిజెపి పార్టీ శ్రేణులతో కలిసి వినతిపత్రం బిజెపి ఓబీసీమోర్చా కోహెడ మండల అధ్యక్షుడు కక్కర్ల దామోదర్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా కక్కర్ల దామోదర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో చేసిన బిసి డిక్లరేషన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు ప్రభుత్వ సివిల్ కన్ స్ట్రక్షన్ మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు గొల్ల కురుమలకు 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీ కి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని అకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేశారు బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హోదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఏడాదికి 20.వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ చేస్తామని ఏర్పాటు చేయలేదు అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మరియు ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేస్తున్నారు సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపే ప్రయత్నం చేస్తున్నారు ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక వివిధ సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు గాని, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని నేటికి తీసుకోలేదు కాబట్టే ఒకసారి ప్రభుత్వంలో లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకే ఈరోజున రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి ఓబీసీమోర్చా కమిటీల నేతృత్వంలో అన్ని తహిసిల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం ఇచ్చే సందర్భంగా కోహెడ తహిసిల్దార్ కార్యాలయంలో పై విషయాలకు తెలియజేస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరిగింది ప్రభుత్వం వారం రోజుల్లో పై విషయాల పైన చర్యలు ప్రారంభించకపోతే లక్షల మంది బీసీలతో అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిరసనలు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య గౌడ్, బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు ఖమ్మం సతీష్, బొమ్మగాని శివకుమార్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకుడు బినావేని లక్ష్మణ్ యాదవ్, బిజెపి ఓబీసీమోర్చా మండల ప్రధానకార్యదర్శి ఎదులపురం రాజు చారి, మెండే సంతోష్, పార్టీ నాయకులు ముంజ సాగర్ గౌడ్, జాగిరి పర్షరాములు గౌడ్, పిడిశెట్టి తిరుపతి, సంగా మహేష్, పాలకొండ సాగర్ తదితరులున్నారు.

## దమ్మాయిగూడ మున్సిపల్ లో ఏసీబీ దాడులు




ఇంటి నిర్మాణం విషయంలో కమిషనర్ డబ్బుల డిమాండ్

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ దమ్మాయిగూడ కమిషనర్

రూ. 30వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

అక్షరంన్యూస్, దమ్మాయిగూడ: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు. ఇంటి నిర్మాణం విషయంలో సుదర్శన్ అనే వ్యక్తి దగ్గర అనుమతి కొరకు కమిషనర్ డబ్బులు కావాలని డిమాండ్. రూ. 50వేలు ఇవ్వాలని లేదంటే అనుమతి రాదని హుకుం జారీ చేశారు. బాధితుడు సుదర్శన్ చేసేదేమీ లేక గత పది రోజుల క్రితమే రూ.20వేలు ఇచ్చాడు. మీరు అడిగినంత ఇవ్వలేమని చెప్పిన కమిషనర్ రాజమల్లయ్య వినలేదు. డబ్బులు ఇవ్వలేని స్థితిలో ఉన్న మేము ఏసీబీ అధికారులు కలిశాము. సోమవారం మిగతా డబ్బులు రూ.30వేలు కమిషనర్ కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ప్రభుత్వ అధికా రులు లంచం కోసం డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

## ఎస్సై ని మర్యాద పూర్వకంగా కలిసిన దీకొండ కుమార స్వామి

చొప్పదండి/ కరీంనగర్,జులై 22 (అక్షరం న్యూస్ )



చొప్పదండి సబ్ ఇన్స్పెక్టర్ గా భాద్యత లు తీసుకున్న గొల్లపెల్లి అనూష ను సోమవారం రోజున ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా యుత్ అధ్యక్షులు దీకొండ కుమారస్వామి మర్యాదపూర్వకం గా కలిశారు. అనంతరము ఎస్సై కి పుష్ప గుచ్చము అందజేసి ఆమెను శాలువాతో సన్మానించారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి కి సమాజ సేవ కు సత్కారం అవార్డ్స్







చొప్పదండి /కరీంనగర్, జులై 22 (అక్షరం న్యూస్ )

జిల్లా 320జి 2023-24 గవర్నర్ లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి గత సంవత్సరం సమాజానికి చేసిన సేవలను గుర్తించి ఆదివారం రాత్రి కరీంనగర్ లోని కే.ఎస్.ఎల్ కన్వెన్షన్ లో చొప్పదండి లయన్స్ క్లబ్ కు అవార్డులు ప్రకటించారు. క్లబ్ అవార్డ్స్ లో భాగంగా హంగర్ రిలీఫ్, నీడ్ బేస్డ్ సర్వీస్, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్,ఎల్.సి.ఐ.ఎఫ్ సపోర్ట్ కి అవార్డులు ఇచ్చారు. వ్యక్తిగత విభాగంలో 7 అవార్డులు,ఉత్తమ అధ్యక్షులుగా మహేశుని మల్లేశం, కార్యదర్శి గా దూస రాము,కోశాధికారి గా రాజేష్ పవార్, బెస్ట్ అడిషనల్ సెక్రటరీ గా మోర భద్రేశం, బెస్ట్ క్యాబినెట్ సభ్యులు గా కొల్లూరి ఆనందం,బెస్ట్ ఎల్సిఐఎఫ్ సపోర్ట్ పెద్ది లక్ష్మి కాంతం, కొల్లూరి జితేందర్ కి గవర్నర్ లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి అందించారు.

## వివాదంలో ఐఎఎస్ స్మితా సబర్వాల్

- **సివిల్స్ ఎంపికలో వికలాంగ కోటాపై పోస్ట్**
- **తేనెతుట్టెను కదపడంతో పలువురు విమర్శలు**



హైదరాబాద్,జూలై22అక్షరం న్యూస్ )

: ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ వివాదం తర్వాత ఇప్పుడు సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానం గురించి కొత్త చర్చ మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఐఏఎస్‌లో వికలాంగుల కోటాపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. వైకల్యం ఉన్న పైలట్‌ను ఎయిర్‌లైన్ నియమించుకుంటుందా? లేదా మీరు వైకల్యం ఉన్న సర్జన్‌ని విశ్వసిస్తారా అంటూ పోస్ట్ చేశారు. సివిల్ సర్వీసెస్ అధికారుల బాధ్యత అనేది ఫీల్డ్ వర్క్, పన్నులు విధించడం, ప్రజల మనోవేదనలను నేరుగా వినడం వంటివి ఉంటాయి. కాబట్టి ఈ ప్రీమియర్ సర్వీస్‌కు ఈ కోటా అవసరమా అని తన అభిప్రాయాలను వెల్లడించారు. స్మిత సబర్వాల్ పోస్ట్ చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వికలాంగుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలు ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. వికలాంగులను 'సంకుచిత దృక్పథం'తో చూడరాదని, వారి అర్హతపై ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. దీనిపై శ్రీకాంత్ మిర్యాల అనే రచయిత, సైకియార్టిస్ట్ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ప్రత్యక్ష ఉదాహరణలతో గతంలో ఎంబీబీఎస్ చదివేటప్పుడు తన ప్రిన్సిపాల్ కాలుకి పోలియో సోకి సరిగా నడవలేనివారు, అయినా కూడా ఎడమచేత్తో రాసి, పాఠాలు చెప్పారాని గుర్తు చేశారు. ఇలా అనేక మంది దివ్యాంగులు పలు రంగాల్లో ఉన్నట్లు గుర్తు చేశారు. అంతేకాదు ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఇలా ట్వీట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. మీ పని మీరు సరిగ్గా చేయండి చాలు. అంతేకానీ మీకు సలహాలు ఇచ్చే స్థాయి ఇంకా రాలేదని చెబుతున్నారు. అంతేకాదు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దగ్గర పనిచేసిన ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణల మధ్య ఈ వివాదం మొదలైంది. యూపీఎస్సీ పరీక్షలో తన అభ్యర్థిత్వాన్ని పొందేందుకు వైకల్యం, ఇతర వెనుకబడిన తరగతి కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఫేక్ ఐడెంటిటీ ఇచ్చి అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయత్నించారనే ఆరోపణలపై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖేద్కర్‌పై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో స్మిత వ్యాఖ్యలు పలువురి విమర్శలకు కారణమయ్యింది.

# బడ్జెట్ సామాన్యులకు చిక్కేనా ?



హైదరాబాద్, జూలై 22( (అక్షరం న్యూస్ )

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ తరవాత ఎన్నికలు..ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత పూర్తిస్థాయి బడ్జెట సమావేశాలు మొదలయ్యాయి. ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న అనేక అంశాలకు, సమస్యలకు పార్లమెంట్ జవాబుదారీ కావాలి. ప్రజలకు తాము అండగా ఉన్నామన్న సంకేతం వెళ్లాలి. అప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఇకపోతే దేశానికి దశాదిశానిర్దేశం చేసేలా బడ్జెట్ పద్దులు ఉండాలి. బడ్జెట్ అనగానే దేశ అభివృద్ధి ముఖచిత్రం కనిపించాలి. అంకెలా గారడీ కాకుండా దేశాన్ని నిలబెట్టేలా, ఆపన్నులను ఆదుకునేలా, భవిష్యత్ దర్శనం చూపేలా ఉండాలి. కానీ ఏటా మొక్కుబడి బడ్జెట్ ప్రసగాలు సాగుతున్నాయి. గత పదేళ్లలో ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న వారికి ఏ రకంగానూ బడ్జెట్‌లో ఏరడింపు కలగలేదు. ఈ క్రమంలో మంగళవారం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై దేశ ప్రజల్లో సహజంగానే ఆసక్తి కలుగుతోంది. గత పదేళ్లకు భిన్నంగా బడ్జెట్ ఉంటుందా అన్న ఆసక్తి, ఉత్కంఠ కూడా కలుగుతోంది. తొలిసారి సంకీర్ణంలోకి అడుగుపెట్టిన మోడీ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో విపక్షాలతో సహా, అన్ని తరగతుల ప్రజలు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి కనబరు స్తున్నారు. దీంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే బడ్జెట్‌పై సర్వత్రా చర్చ సాగుతోంది. ఇకపోతే దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడోసారి కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. అంతకుముందు పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ పేరిట వరుసగా ఏడు బడ్జెట్‌లు సమర్పించిన రికార్డు నమోదు కానుంది. ఇప్పటి వరకు ఈ రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్మలా సీతారామన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవస్థలోని వేర్వేరు వాటాదారులతో చాలాసార్లు చర్చలు జరిపింది. విద్య, ఆరోగ్య రంగం, క్యాపిటల్ మార్కెట్, ఉపాధి, నైపుణ్యాలతో పాటు రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. పలువురు ఆర్థికవేత్తలతోనూ ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు తగ్గింపుపై దృష్టి సారించాలని ఆర్థికవేత్తలు కేంద్రానికి సూచించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని రైతు సంఘాలు ఆర్థిక మంత్రిని కోరాయి. ఇకపోతే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కాలని ఈ రెండు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల సిఎంలు పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి ఇప్పటికే వివిధ అంశాలపై వినతులు సమరపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ.. ఏపీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోనూ ఈసారి బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకోవడంతో.. రాష్ట్రానికి గతానికంటే ఎక్కువ లబ్ధి చేకూరేలా నిర్ణయాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గతంలో లాగానే బడ్జెట్ 2024 కూడా పేపర్‌లెస్ ఫార్మాట్‌లో ఉండనుంది. బడ్జెట్ పత్రాలు హిందీ, ఇంగ్లీష్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన అన్ని పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీంతో పార్లమెంట్ సభ్యులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బడ్జెట్ పత్రాలు అందుతాయి. బడ్జెట్ సమర్పించిన కొద్దిసేపటికే అన్ని పత్రాలు ఈ యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సారి బడ్జెట్ లో కేంద్రం ప్రజాకర్షక విధానాలవైపే మొగ్గుచూప బోతున్నట్టు తెలిసింది. ఆదాయపన్నుల్లో ఉపశమనం, కిసాన్ సమ్మాన్ నిధి, ఇళ్ల నిర్మాణాలకు ఊతమిచ్చే విధంగా నిర్ణయాలు ఉండబోతున్నట్లు తెలిసింది. మరోవైపు ఆదివారం అఖిలపక్ష స మావేశం జరిగింది. ఇందులో సంఘటిత ప్రతిపక్షాలు పలు కీలక విషయాలను ప్రభుత్వం ముందుంచాయి. విపక్షం బలంగా ఉండడం వంటి కారాణాల వల్ల పార్లమెంట్ సమావేశాల్లో ఇక దాటవేత ధోరణి కుదరదు. ప్రత్యేకించి నీట్ వివాదం, పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి విషయాలపై సభలలో చర్చకు అవకాశం ఇవ్వాల్సిందే అని ప్రతిపక్షాలు అఖిలపక్షంలో పట్టుపట్టాయి. అనుకున్నట్లుగానే తొలిరోజే అంటే సోమవారమే దీనిపై విపక్ష నేత రాహుల్ ప్రస్తావించారు. చర్చకు పట్టుబట్టారు. అలాగే అనేకమైన ప్రజల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. బడ్జెట్‌తో పాటు, ప్రజా సమస్యలపై సహేతుకమైన సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉండాల్సిందే. గతంలో లాగా వాయిదాలు వేయడం,దాటవేయడం, ఎంపిలను సస్పెండ్ చేయడం లాంటి చర్యలు కదరవని గుర్తించాలి. ఇక ప్రభుత్వానికి కూడా సభా నిర్వహణలో అందరి మద్దతు అవసరం. అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధం అని అఖిలపక్షంలో కేంద్రమంత్రులు వెల్లడించారు. అయితే ఏదైనా కూడా సభా నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. వీటిని అంతా పాటించాల్సిందేనని ప్రతిపక్ష నేతలకు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభ అందరిదీ, సమిష్టి సహకార వైఖరితోనే నిర్ణీత రీతిలో సభలు నిర్వహించేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో విపక్షాలు కూడా సమర్థంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం గొడవలు సృష్టించేందుకు కాకుండా ఉమ్మడిగా సమస్యలపై చర్చించి ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ఏదేమైనా సమావేశాలు అన్నవి ప్రజలకు సంబంధించినవిగా అటు ప్రభుత్వం, ఇటు విపక్షం గుర్తించాలి. ఇవి తమ ప్రతిష్టకు సంబంధించినవిగా చూడరాదు. ప్రతిష్టకు, పంతాలకు కూడా ఇది సమయం కాదు. ప్రజల సమస్యలపై పార్లమెంట్ జవాబుదారీగా వ్యవహరించాలి. గతంకన్నా భిన్నంగా సభ సాగిందన్న పేరు రావాలి. అప్పుడే దేశంలో నాయకులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలపడుతుందని గుర్తించాలి.

# బడ్జెట్ ప్రవేశంలో నిర్మల చరిత్ర

**అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత**

**మరోమారు ఎవ్వరికీ అందనంతగా రికార్డు**




న్యూఢిల్లీ,జూలై22( (అక్షరం న్యూస్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న మంగళవారం మరోమారు పార్లమెంట్‌లో 2024-25 బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతున్నారు. మోదీ 3.0 సర్కారులో ఆమె ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ కాగా, ఆమె మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి, మహిళా మంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు. గతంలో ఉన్న రికార్డునలు తిరగరాయబోతున్నారు. మొత్తంగా చూస్తే ఆమె ప్రవేశపెడుతున్న ఏడో కేంద్ర బడ్జెట్ ద్వారా తన పేరును చరిత్రలో లిఖించుకోబోతున్నారు. ఇప్పటికే నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఐదు పూర్తిస్థాయి బడ్జెట్ లు సమర్పించగా.. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.. ఇప్పుడు ఆరోసారి పూర్తిస్థాయి బ్జడెట్ ను ప్రవేశబెట్టి.. మరో రికార్డును తిరగరాయనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్, అరుణ్‌జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్‌సిన్హా, మన్మోహన్‌సింగ్‌ను ఆమె అధిగమించనున్నారు. 1959 నుంచి 1964 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదుమార్లు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా మొరార్జీ దేశాయ్ అత్యధికసార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్నాళ్లు అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరు మీదే ఉంది. దీనిని

ఎవ్వరూ బ్రేక్ చేయలేదు.. అయితే.. తాజా బడ్జెట్ తో నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనతను సాధించబోతున్నారు. వాస్తవానికి ఇందిరా గాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళ నిర్మలా సీతారామన్.. ప్రధాని హోదాలో ఉంటూ నాడు ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారతదేశంలో తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా ఎక్కువ కాలం కొనసాగిన నేతగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే రికార్డును నమోదు చేసుకున్నారు.వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టడంలోనూ నిర్మల సీతారామన్ కొత్త పోకడలు తీసుకొచ్చారు. సంప్రదాయ బ్రీఫ్‌కేస్ విధానానికి ఆమె మంగళం పాడారు. జాతీయ చిహ్నంతో కూడిన ఖాతా పుస్తకం తరహాలో ఉండే బ్యాగులో ఆమె బ్జడెట్ పత్రాలు తీసుకొచ్చే సంప్రదాయానికి ఆమె శ్రీకారం చుట్టారు. 2019లో తొలి బ్జడెట్ నుంచి ఆమె ఖాతా బుక్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటి వరకు అతి సుదీర్ఘ బ్జడెట్ ప్రసంగం రికార్డు, అతి స్వల్ప ప్రసంగం రికార్డు కూడా నిర్మలా సీతారామన్ పేరిటే ఉన్నాయి. 2020లో ఆమె చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆమె చేసిన 57 నిమిషాల ప్రసంగం ఇప్పటి వరకు చేసిన ప్రసంగాల్లో అత్యల్పమైనది. నిర్మలా సీతారామన్.. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆమెను కొనసాగుతున్నారు. మోదీ త్రీ పాయింట్ ఓ లో మొత్తం ఐదేళ్ల కాలానికి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగితే అది కూడా ఒక రికార్డవుతుంది.. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# ఆగస్ట్‌లో ముగ్గురు హీరోల సందడి

### మూడు ప్రధాన సినిమాల విడుదల

హైదరాబాద్, జూలై 22 ( (అక్షరం న్యూస్ )

వచ్చే ఆగస్టు 15వ తేదీ వస్తోంది అంటే సినిమా ప్రియులకి మంచి శుభవార్త. ఆరోజు ముగ్గురు కథానాయకులు తమ సినిమాలతో పోటీ పడుతున్నారు. అందులో ఇద్దరు సీనియర్ నటులు కాగా, ఒకరు యువ నటుడు వున్నారు. రామ్ పోతినేని, పూరి జగన్ కాంబినేషన్ లో వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా ఇంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్ లో విజయవంతంగా వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' కి సీక్వెల్ గా వస్తోంది. కావ్య థాపర్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. పూరి జగన్, ఛార్మి ఈ సినిమాకి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. పూరి జగన్ ఇంతకు ముందు విజయ్ దేవరకొండతో తీసిన 'లైగర్' బాక్స్ ఆఫీస్ దగ్గర ఒక డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. అందుకనే ఈ సినిమాపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. ఇక రెండో సినిమా రవి తేజ, దర్శకుడు హరీష్ శంకర్ ల కాంబినేషన్ లో వస్తున్న 'మిష్టర్ బచ్చన్'. ఇది హిందీ సినిమా 'రైడ్' కి రీమేక్ గా వస్తోంది. రాజ్ కుమార్ గుప్త దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అజయ్ దేవగన్ కథానాయకుడు, ఇలియానా కథానాయికగా నటించింది. ఇన్కమ్ టాక్స్ రైడ్ నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాని దర్శకుడు హరీష్ శంకర్ 'మిష్టర్ బచ్చన్' పేరుతో రీమేక్ చేశారు. సౌరబ్ శుక్ల నటించిన పాత్ర తెలుగులో జగపతి బాబు పోషిస్తున్నారని అంటున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయకురాలు. ఈ సినిమా ఆగస్టు 15న విడుదలవుతుందని అధికారికంగా ప్రకటించారు. రవి తేజ ముందు సినిమాలు 'ఈగల్', 'టైగర్ నాగేశ్వర రావు' సినిమాలు బాక్స్ ఆఫీస్ ముందు బోల్తా పడ్డాయి. ఇప్పుడు ఈ 'మిష్టర్ బచ్చన్' బాక్స్ ఆఫీస్ ముందు ఎలా ఉంటుందో చూడాలి. ఇప్పటికే ఈ సినిమా నుండి ఒక పాటని విడుదల చేశారు, అది మంచి ప్రజాదరణ పొందింది. ఇంకో సినిమా తమిళ నటుడు విక్రమ్ నటించిన 'తంగలాన్'. పా. రంజిత్ దీనికి దర్శకుడు, ప్రముఖ నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ ఈ సినిమాని పెద్ద బ్జడెట్ పెట్టి నిర్మిస్తోంది. కెఈ జ్ఞానవేల్ రాజా నిర్మాత. ఈ సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ సినిమా అటు తమిళం, తెలుగు భాషలతో పాటుగా మిగతా అన్ని భాషల్లో కూడా విడుదలవుతోంది. విక్రమ్ ఇందులో మూడు వైవిధ్యమైన పాత్రలలో కనిపించి మెప్పిస్తారు అని అంటున్నారు. ఈ సినిమా ఒక పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కనుంది. ఇంతకు ముందు వచ్చిన 'కేజీఎఫ్' సినిమాకి ప్రీక్వల్ గా ఈ సినిమా ఉండొచ్చు అని కూడా అంటున్నారు. మాళవిక మోహనన్ ఇందులో ఇంకో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఇలా మూడు సినిమాలతో ముగ్గురు కథానాయకులు ఈ ఆగస్టు 15వ తేదీన వస్తున్నారు. ఆ తేదీ నుండి వరసగా సెలవులు కలిసి రావటం ఈ సినిమాలకి బాగా కలసి వస్తుందని కూడా అంటున్నారు. ఈ మూడు సినిమాలతో పాటు చిన్న సినిమా '35: చిన్న కథ కాదు' అనే సినిమా కూడా ఆగస్టు 15న విడుదలవుతోంది. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈ సినిమాకి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈమని నందకిషోర్ దర్శకుడు, కాగా నివేద థామస్, విశ్వదేవ్ రాచకొండ, ప్రియదర్శి ఇందులో ప్రధాన తారాగణం.







# భారతీయుడు-2 బాగుందంటూ తలైవా కితాబు

హైదరాబాద్, జూలై 22 ( (అక్షరం న్యూస్ )

విలక్షణ నటుడు కమల్‌హాసన్- సుప్రసిద్ధ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'భారతీయుడు-2' ఇటీవలే విడుదలయ్యింది. అయితే చిత్రానికి మొదటిరోజే భారీ ఫ్లాప్ టాక్‌ను తెచ్చుకుంది. ముఖ్యంగా శంకర్‌పై విమర్శలు వెలువెత్తాయి. కంటెంట్ లేకుండా భారీగా ఖర్చుపెట్టారు. కానీ సినిమా మత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది అంటూ కమల్ అభిమనులతో పాటు సగటు ఆడియన్స్ కూడా నిరాశ చెందారు. ఈ చిత్రం తనకు నచ్చిందని సినిమా బాగుందని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కామెంట్స్ చేయడం అందరిన్ని ఆశ్చర్యపరిచింది. కేరళలోని ఓ వివాహానికి హాజరై చెన్నయ్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు రజనీకాంత్. దీంతో పాటు బయట ప్రచారం జరగుతున్నట్లుగా తన 'వేట్టయాన్' సినిమా వాయిదా పడలేదని, షూటింగ్ శరవేగంగా జరుగు తుందని,తన పార్ట్ డబ్బింగ్ కూడా పూర్తయిందని.. దసరాకు చిత్రాన్ని విడుదల చేసే అవకాశం వుందని స్పష్టం చేశారు. సూర్యతో 'కంగువ' చిత్రాన్ని నిర్మిస్తున్న నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఇంతకు ముందు వేట్టయాన్ వాయిదాపై మాట్లాడారు. దీంతో పాటు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న కూలీ చిత్రంలో కూడా రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా.. ఈ సినిమా రూపొందుతోంది. శ్రుతిహాసన్, సత్యరాజ్ ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో కనిపిస్తారు.



# ఎన్టీఆర్‌తో మల్టీస్టారర్ మూవీ చేయాలనుంది

### రాయన్ ప్రమోషన్‌లో నటుడు ధనుష్

తమిళ నటుడు ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం రాయన్. సందీప్ కిషన్, మలయాళం నటుడు కాళిదాస్ జయరాం ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా.. ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాను ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. విడుదల తేదీ దగ్గరపడటంతో ఆదివారం హైదరాబాద్‌లో భారీ ఎత్తున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలో ధనుశ్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు. టాలీవుడ్‌లో తన ఫేవరెట్ హీరో పవన్ కళ్యాణ్ అని వెల్లడించారు. 'ఐ లవ్ సినిమా, ఐ లవ్ పవన్ కళ్యాణ్ సర్' అంటూ చెప్పుకొచ్చారు. ఇక ధనుశ్ చేసిన ఈ వ్యాఖ్యలకు ఆడిటోరియం అంతా దద్దరిల్లిపోయింది. జూనియర్ ఎన్టీఆర్‌తో మల్టీస్టార్టర్ మూవీ చేయాలని ఉందని ధనుశ్ అన్నారు. చిత్ర కథ విషయానికి వస్తే.. అతనో సాధారణ వ్యక్తి. మద్రాస్‌లోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తుంటాడు. కానీ అతని గతం మాత్రం పగతో రగిలిపోతుంటుంది. ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం ఎదురుచూస్తుంటాడు.



ఇంతకి ఆ వ్యక్తి ప్రతీకారం ఎవరి మీద? పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ అయిన అతను హోటల్‌లో చెఫ్‌గా ఎందుకు పనిచేయాల్సి వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే 'రాయన్' సినిమా చూడాల్సిందే అని చెబుతోంది చిత్ర బృందం. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో పాటు ధనుష్ ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు.

# ఆసక్తి రేకెత్తిస్తున్న రాజమౌళి..మోడ్రన్ మాస్టర్స్

### అతనో లెజెండ్ అంటూ చిత్ర ప్రముఖుల కామెంట్స్




హైదరాబాద్, జూలై 22 ( (అక్షరం న్యూస్ )

టాలీవుడ్ అగ్ర దర్శకుడు రాజమౌళిపై ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపొందించింది. ఇందులో ఆయన సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది స్ట్రీమింగ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందులో టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌లతోపాటు హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్, బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహర్‌లు కూడా వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇలాంటిదర్శకుడిని నేను ఇప్పటివరకు చూడలేదు. సినిమాలంటే ఆయనకు పిచ్చి ప్రేమ అని ప్రభాస్ తన అబిప్రయాం పంచుకున్నారు. ఆయన సినిమాల్లో నన్ను నేను చూసుకొని ఎంతో ఆశ్చర్యపోతానని నటుడు రామ్‌చరణ్ ప్రకటించారు. ఇప్పటివరకు ఎవరూ చూపించని కథలను ప్రపంచానికి చెప్పడం కోసమే రాజమౌళి జన్మించారని మరో నటుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ ఇద్దరు కూడ ఆరాజమౌళి ట్రిపుల్ ఆర్‌లో మంచి నటనను చాటారు. రాజమౌళికి సాధ్యం కానిది ఏదీ లేదు. ఎవరితోనైనా పని చేయగలరు. ఆయనంటే నాకెంతో గౌరవం అంటూ ఆంగ్ల చిత్రాల దర్శకుడు జేమ్స్ కామెరూన్ వ్యాఖ్యానించారు. రాజమౌళితో పని చేసిన వారందరూ ఆయన్ని పని రాక్షసుడని పిలుస్తుంటారని ఆయన భార్య, ప్రముఖ క్యాస్టూమ్స్ డిజైనర్ రమా రాజమౌళి అభిప్రాయపడ్డారు. దర్శకుడు రాజమౌళి ఓ లెజెండ్ అని హిందీ దర్శక సమర్పకుడు కరణ్ జోహార్ అన్నారు.

# సోషల్ మీడియా విమర్శలు...

### పట్టించుకోవాల్సిన పనిలేదన్న జాన్వీ

హైదరాబాద్, జూలై 22 ( (అక్షరం న్యూస్ )



ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రి లో చేరిన జాన్వీకపూర్ కోలుకుని ఇంటికి చేరుకుని.. రెండ్రోజుల్లోనే మళ్లీ యాక్టివ్ అయ్యాక వరుస ప్రమోషన్లో పాల్గొంటున్నారు. తన తదుపరి చిత్రం 'ఉలర్ఘ్' చిత్రం విడుదల నేపథ్యంలో ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా ట్రోల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా స్టార్‌కిడ్స్ ఎదుర్కొంటున్న విమర్శలపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. అసలు వాటిని పట్టించుకోవడం కూడా వృథా. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. నువ్వు పబ్లిక్ ఫిగర్ అయినా, కాకపోయినా ఇలాంటివి నిరంతరం జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడినవాళ్లే అదే విషయంపై రేపు తిడతారు. ముక్కూ, మొఖం తెలియని వాళు ఏదో అన్నారని ఇంట్లో కూర్చొని ఏడవడం దేనికి?. మనకు మనమే ప్రాధాన్యం ఇచ్చుకోవాలి' అని అన్నారు. అనంతరం అనంత్ అంబానీ సతీమణి రాధిక మర్చంట్ కోసం పార్టీ ఇవ్వడంపైజాన్వీ మాట్లాడారు. 'రాధిక నాకు మంచి ఫ్రెండ్. తను మాతో చాలా సరదాగా ఉంటుంది. మమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. అందుకే, వివాహానికి ముందు ఆమె కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ ఏర్పాటుచేయాలని ఫ్రెండ్స్ అందరం అనుకున్నాం. అందులో భాగంగా గ్రాండ్ పార్టీ ఇచ్చాం. తను చాలా సంతోషించింది' అని చెప్పారు. 'ఉలర్ఘ్' విషయానికి వస్తే.. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జంగ్లీ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ తైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు.

# అమీర్‌తో విడిపోయాకా బాగానే ఉన్నా

### దర్శకురాలు కిరణ్ రావు వెల్లడి



హైదరాబాద్, జూలై 22 ( (అక్షరం న్యూస్ )

ఆమిర్‌ఖాన్‌తో వైవాహిక జీవితానికి స్వస్తి పలకడంపై ఆయన మాజీ సతీమణి, దర్శకురాలు కిరణ్‌రావు స్పందించారు. విడాకుల తర్వాత తాను కుంగిపోలేదని, సంతోషంగా ఉన్నానని చెప్పారు. ఇరు కుటుంబాలు తనకు అండగా ఉన్నాయని చెప్పారు. సంబంధాలు ఎప్పటికప్పుడు పునర్నిర్వచించబడాలని నేను భావిస్తున్నా. ఎందుకంటే, మనం పెరిగేకొద్దీ మనుషులుగా మారతాం. సుమారు 16 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నప్పుడు ఎమోషనల్, మానసికంగా దానిని తట్టుకోవడానికి కాస్త సమయం పట్టింది. విడాకుల తర్వాత సంతోషంగా ఉంటాననుకున్నా. అదే జరిగింది. ఆమిర్ నా జీవితంలోకి రావడానికి ముందు చాలా ఏళ్లు సింగిల్‌గానే ఉన్నా. నా స్వతంత్రతను ఎంజాయ్ చేశా. కాకపోతే అప్పట్లో కొన్నిసార్లు ఒంటరిగా ఫీలయ్యా. కానీ, ఇప్పుడు అలా కాదు. నా కొడుకు ఆజాద్ ఉండటంతో ఒంటరితనం నా దరి చేరదు. ఇరు కుటుంబాల నుంచి నాకు సపోర్ట్ ఉంది. ఆమిర్‌తో ఇప్పటికీ నాకు మంచి అనుబంధం ఉంది' అని చెప్పారు.ఆమిర్‌ఖాన్ నటించిన 'లగాన్'కు కిరణ్‌రావు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. 2005లో ఆమిర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. పరస్పర అంగీకారంతో సుమారు 16 ఏళ్ల వైవాహిక బంధానికి 2021లో స్వస్తి పలికారు. కిరణ్‌రావును వివాహం చేసుకోవడానికంటే ముందు ఆమిర్‌కు వివాహమైన విషయం తెలిసిందే. వర్క్ విషయానికి వస్తే.. దర్శక నిర్మాతగా కిరణ్‌రావుకు బాలీవుడ్‌లో మంచి పేరు ఉంది. ఇటీవల 'లాపతా లేడీస్'తో దర్శకురాలిగా మంచి విజయాన్ని అందుకున్నారు.

## అవార్డు ప్రదానం



**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్) ఖమ్మం :** ఆదివారం రోజున కరీంనగర్ ఫిల్మ్ భవనం ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో స్వర సుధ ఉపాధ్యక్షులు ప్రముఖ సీనియర్ సింగర్ వి.విరెడ్డి ఖమ్మం వాసి స్ఫూర్తి ప్రదాత" అవార్డును అందుకున్నారు . సగౌరవంగా స్వర్ణ కంకణధారణతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ అధ్యక్షులు శ్రీ దూడపాక శ్రీధర్ , కార్యదర్శి శ్రీమతి మణీ రాయల్ , విశ్వవిఖ్యాత ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ హైదరాబాద్ అధ్యక్ష , కార్యదర్శులు వివిధ రంగాల ప్రముఖులు మరియు ఖమ్మం స్వరమదధురిమ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ పాల్గొన్నారు .

## తల్లాడ మేజర్ పంచాయతీ ఈవోగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ..





**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా ఎస్ యూఎంపీ కృష్ణారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కల్లూరు నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఈవోగా విధులు నిర్వహించిన మహేష్ ఎర్రుపాలెం మండలం కొత్తపాలెంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఈవో మాట్లాడుతూ మేజర్ పంచాయతీలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, ఎంపీ ఓ శ్రీదేవి, కల్లూరు ఎంపీఓ తదితరులు ఉన్నారు.

## కొత్తగా పాస్ పుస్తకం వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**- తల్లాడ వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్..**



**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** తల్లాడ మండలంలో కొత్తగా పట్టాదారు పాసు బుక్స్ వచ్చిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి రైతుభీమాకు దరఖాస్తు చేసుకోవాలని తల్లాడ మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14-08-1965 నుండి 14-08-2006 మధ్యలో జన్మించిన రైతులు మాత్రమే ఈ రైతు భీమా కు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు లో 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాలు ఉన్న రైతులు మాత్రమే రైతు భీమా కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.కొత్తగా పట్టాదారు వచ్చిన రైతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 5వ తేదీ వరకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. గతంలో భీమా చేసుకున్న రైతులు భీమా లో మార్పులు చేర్పులు -ఆధార్ లో లేదా నామిని చనిపోతే మార్పుల కోసం చివరి తేదీ 30న అన్నారు. కొత్తగా పాస్ బుక్స్ వచ్చిన రైతుల రైతు భీమా చేసుకోవడానికి కావలసిన పత్రాలు రైతు భీమా దరఖాస్తు, రైతు పట్టాదారు పాస్ బుక్, తాసిల్దార్ తో డిజిటల్ సంతకం అయిన డీఎస్ పేపర్, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జత చేయాలని సూచించారు.

## కృష్ణవేణికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య..



**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** తల్లాడ నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి సోదరుడు దగ్గుల అప్పి రెడ్డి కుమార్తె కృష్ణవేణి దశదినకర్మ సోమవారం తల్లాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశాను. నివాళులర్పించిన వారిలో ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు. రెడ్డెం వీర మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాలు, తల్లాడ టౌన్ ప్రెసిడెంట్. గరిడేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు. గుండ్ల నాగయ్య, తల్లాడ ఉప సర్పంచ్ వెంకటేశ్వరావు, వజ్రాల రామిరెడ్డి. దగ్గుల రాజశేఖర్ రెడ్డి, దగ్గుల శివారెడ్డి, సంఘసాని శీను, వార్డ్ మెంబర్ తేలూరి రఘు,వీర కృష్ణ, జివిఆర్, నాయకులు పాల్గొన్నారు.

## గోదావరికి ఇరువైపులా వరద ముంపు నివారణ చర్యలు చేపట్టండి

**- జిల్లా మంత్రివర్యులందరికీ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి**



**భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ జులై 22/ అక్షరం న్యూస్:** ప్రతీ సంవత్సరం వర్షాకాలం లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి తో పాటు వాగులు, వంకలు పోంగి పోర్లడం, భద్రాచలం పట్టణం తో పాటు గోదావరి నదికి ఇరువైపులా పంటపొలాలు ముంపుకు గురౌడం, ప్రజలు ఇబ్బందులు పడడం, జాగ్రత్తలు పాటించండి అంటూ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేయడం, ముఖ్యమంత్రుల ఆదేశాల మేరకు ముంపుకు గురైన నిర్వాసితులకు అధికారులు వసతి భోజన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమే కానీ, మంత్రులు ముఖ్యమంత్రి రావడం అదిచేస్తాం ఇదిచేస్తాం అని గొప్పగా చెప్పడం వాగ్ధానాలు అమలు చేయకపోవడం, వానాకాలం తరువాత పట్టించుకోక పోవడం నాయకులకు పరిపాటిగా మారింది తప్ప ఈ ప్రాంతానికీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని భద్రాద్రిప్రాంత పరిరక్షణసమితీ అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులు మారుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప, కొత్త సీసాలో పాత సారాయిలాగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా నాయకులు వారే వుంటున్నారు కాబట్టి ఇప్పటికైనా వానలు వరదలు వాగ్దానాలు షరా మామూలే అని ప్రజలు భావించకుండా ప్రస్తుత కాంగ్రేసు ప్రభుత్వం లో కూడా కొనసాగుతున్న మంత్రి వర్యులు భద్రాద్రి ప్రాంతానికి శాశ్విత ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపజేసి, వరద ముంపు కు గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు గురి కాకుండా భద్రాచలం పట్టణం వైపుతో పాటుగా, గోదావరి నదికి బూర్గంపహాడు రెడ్డిపాలెం సారపాక మోతే ఇరువెండి వైపు కూడా కరకట్ట నిర్మాణం చేపట్టి, శాశ్విత ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకోవలసినదిగా, పోలవరం ప్రాజెక్ట్ ముంపుకు గురౌతున్న బూర్గంపహాడ్ మండల ప్రాంతానికి ఆర్ ఓ ఆర్ ప్యాకేజీ వర్తింపజేసేందుకూ, తద్వారా భద్రాద్రి ప్రాంతాన్నీ ప్రజానీకాన్నీ కాపాడాలని ప్రస్తుత ప్రాతినిధ్యం వహిస్తున్న అవిభాజ్య ఖమ్మం జిల్లా మంత్రివర్యులందరికీ భద్రాద్రిప్రాంత పరిరక్షణసమితీ అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి





**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం /తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. స్వీకరించిన ఆర్జీలను పరిష్కారం, తిరస్కరణకు గురైతే, కారణం అర్జీదారునికి తెలుపాలన్నారు. ప్రజల నుండి స్వీకరించిన ఆర్జీలను పరిష్కారానికి ఆదేశిస్తూ సంబంధిత అధికారులకు కలెక్టర్ ఫార్వార్డ్ చేశారు. కూసుమంచి మండలం, జీళ్ళచేరువు గ్రామానికి చెందిన అంబాల నరసయ్య, గ్రామంలో ఇండ్ల స్థలాలకు తాను భూమి ఇచ్చినట్లు, తనకు 3 ప్లాట్లు కేటాయించి, పట్టా ఇవ్వవలసినదిగా కోరగా, కూసుమంచి తహసీల్దార్ కు తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామం నుండి పొట్టపింజర మాధవి, తన ఇంటి నెం. 1-57, ఈ నెల 16న వర్షాలకు కూలిపోయినట్లు సహాయం చేయాల్సిందిగా కోరగా, జెడ్పి సిఇఓ ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం నాచారం నుండి కాట్రగడ్డ లలిత, తన రేషన్ కార్డ్ రిజెక్ట్ అయిందని, ఇట్టి విషయమై చర్యకై కోరగా, జిల్లా పౌరసరఫరాల అధికారిని పరిశీలించి, తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం రామకృష్ణాపురం నుండి శనిగవరపు శ్రీనివాస్, తాను ప్రజాపాలన క్రింద గృహజ్యోతికి దరఖాస్తు చేసినట్లు, తనకు ఉచిత విద్యుత్ వచ్చేలా చూడాలని కోరగా, చింతకాని ఎంపిడిఓ ని తగుచర్యకై ఆదేశించారు. కొనిజర్ల మండలం అమ్మపాలెం నుండి ఉసికల చిన్నిరాములు, తనకు దళితబంధు మంజూరు రెండో విడత మొత్తం ఇప్పించగలందులకు కోరగా, ఎస్సి కార్పొరేషన్ ఇడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. పి. చంద్రకళ, జూనియర్ లెక్చరర్, తాను మధిర నుండి ఖమ్మం బదిలీ అయినట్లు, కేంద్రీయ విద్యాలయంలో తన పిల్లలకు సీట్లు ఇప్పించగలందులకు కోరగా, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ని పరిశీలించి, తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. సింగరేణి మండలం కారేపల్లి గ్రామం నుండి పి. మహేష్, తాను దివ్యా%శీ%గుడ నని, చేయూత పెన్షన్ మంజూరుకు కోరగా, డిఆర్డీవో ని తగుచర్యకై ఆదేశించారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామం నుండి నెల్లూరి ఇంద్ర, తన భర్త శ్రీనివాసరావు నవంబర్, 2014 లో చనిపోయినట్లు, తనకు చేయూత పెన్షన్ మంజూరుకు కోరగా, డిఆర్డీవో ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోట గ్రామం నుండి బొడా బాబు, సర్వే నెం. 39 లో 12 కుంటల భూమి, తన అనుమతి లేకుండా భూక్యా మాదా పేరుపై వచ్చిందని, అట్టి పాస్ బుక్ రద్దు చేసి తన పేరున ఇవ్వగలందులకు కోరగా, తహసీల్దార్ ని విచారణ కై కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం గ్రామం నుండి టీచర్స్ కాలని వాసులు, సర్వే నెం. 165/అ, 166/ఆ నందు అనుమతి లేకుండా, సెట్ బ్యాక్ లేకుండా జి ప్లస్ 4 నిర్మాణం జరుగుతున్నట్లు, చర్యలకై కోరగా, జిల్లా పంచాయతీ అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. పుట్టకోట గ్రామం, ఖమ్మం అర్బన్ మండలం నుండి చిన్నంశెట్టి రామారావు, తాను మరుగుజ్జు నని, ఏ పని చేయలేనని, ఉపాధికల్పన కు కోరగా, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ని తగుచర్యకై ఆదేశించారు. తల్లాడ మండలం మల్సూర్ తాండ గ్రామం నుండి భూక్యా రాజగోపాల్, తనకు మీ సేవ కేంద్ర మంజూరు కు కోరగా, ఇడిఎం ని పరిశీలించి, తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. స్థానిక శ్రీనివాస నగర్ నుండి యు. దేవి, తనకు జీవో 58 ద్వారా ఇంటిస్థలం ఇచ్చియున్నారని, అట్టి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకొనుటకు మంజూరు ఇవ్వగలందులకు కోరగా, జెడ్పి సిఇఓ ని పరిశీలించి, తగుచర్యకై ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం, పిండిప్రోలు గ్రామం నుండి కె. సుభద్ర, తమకు ప్రభుత్వం 1.14 ఎకరాల భూమి ఇచ్చినట్లు, అట్టి భూమి తమ స్వాధీనం లోనే ఉందని, పట్టా పాస్ బుక్ ఇప్పించగలందులకు కోరగా, తహసీల్దార్ ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి





**- పాము కాటుతో వైద్యం పొందేందుకు వెళ్లిన రైతు పట్ల నిర్లక్ష్యం వహించిన సంఘటనపై విచారణ జరపాలి**

**- జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం సమర్పించిన బీఆర్ఎస్ నాయకులు**

**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని కలిసి చింతకాని మండలం, పొద్దుటూరు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుతో వైద్యం పొందేందుకు వెళ్లిన రైతు పట్ల నిర్లక్ష్యం వహించిన సంఘటనపై విచారణ జరిపించాలని, ఇటీవల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం లు ఉన్నారు.

# తల్లాడలో ప్రారంభానికి నోచుకోని మరుగుదొడ్లు..





**- ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు..**

**- శిధిలావస్థకు చేరుతున్న ప్రారంభించని అధికారులు..**

**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి తల్లాడలోని మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. అవి నిర్మాణం జరిగి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. మండల కేంద్రానికి ప్రజలు నిత్యం వేలాదిగా వస్తు పోతుంటారు. అదేవిధంగా ప్రధాన కార్యాలయాలు మండల పరిషత్, తహసిల్దార్, పోలీస్ స్టేషన్, బ్యాంకులు, వ్యవసాయ శాఖ, మీసేవా, ప్రధాన కార్యాలయాలన్నీ ఆ ప్రాంతంలోనే ఉన్నాయి. దీంతో నిత్యం ప్రజలు భారీగా వస్తూ పోతుంటారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా మండల కేంద్రంలోని మొదటిసారిగా ప్రజా మరుగుదొడ్లను నిర్మించారు. కానీ వాటిని ప్రారంభించకపోవడంతో మహిళలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నిర్మించిన భవనాలు శిధిలవస్థకు చేరుతున్నాయి. ఇప్పటికే భవనాలు పగుళ్లు రావడంతో వీటిపై ప్రజలు నాణ్యత పై పలు రకాలుగా ప్రచారాలు చేస్తున్నారు. వీటిని ప్రారంభించడానికి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారోనని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకొని ప్రజా మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# కుక్కలు బెడదపై చర్యలు తీసుకోండి..

**- పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి**

**- నున్నా నాగేశ్వరరావు**




**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** ఖమ్మం నగరంలో కుక్కల బెడద నుంచి నగర ప్రజలను విముక్తి చేయాలని, వివిధ డివిజన్ ల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం పై కమిషనర్ దృష్టి సారించాలి అని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మం సుందరయ్య భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు ఫలితంగా నగరంలో దాదాపు ప్రతి రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి అని, వాటిలో నీరు చేరి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన వెంటనే నిధులు కేటాయించి గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు. వివిధ డివిజన్ ల్లో కాల్వలు పూడిక కూడా తీయడం లేదు అని, వర్షాలు రావడంతో దోమలు పెరిగి డెంగీ వ్యాధులు వస్తున్నాయి అని తెలిపారు. వెంటనే పారుశుధ్య నిర్వహణపై కమిషనర్ తగిన దృష్టి సారించాలి అని డిమాండ్ చేశారు. మరోవైపు నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది అని రోడ్ పై వెళుతున్న పౌరులపై దాడికి ప్రయత్నం చేస్తున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు ఇస్తామని, సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలను సమీకరించి కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళనలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు డి తిరుపతి రావు, ఎస్ నవీన్ రెడ్డి, నాయకులు బండారు యాకయ్య, ఎస్ కె మీరా సాహిబ్, భుక్యా శ్రీనివాసరావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బలవంతపు కబ్జా అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు వినతి



**- సానుకూలంగా స్పందించిన కలెక్టర్**
**- మున్సిపల్ కమిషనర్‌కు రాత పూర్వక సూచనలు**

**ఖమ్మం /తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** బలవంతంగా భూమి కబ్జా చేయడమే కాకుండా అక్రమంగా నిర్మాణాలు కొనసాగిస్తున్న వైనంపై సోమవారం బాధితులతో కలిసి పలు కుల , ప్రజా సంఘాలు , పార్టీల నాయకుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. గతంలోనే తాము వినతిపత్రాన్ని సమర్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ , అక్రమ నిర్మాణంపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వెంటనే ఫోన్ చేసి , యధాతధ స్థితిని అమలు చేయమని పేర్కొన్నారు . ఈ మేరకు జిల్లా కలెక్టర్ వినతి పత్రంపై రాతపూర్వక సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ. కృష్ణారావు , అఖిలభారత యాదవ సంఘం నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్ , కార్పొరేటర్ మలీదు జగన్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు యాదవ్ , టిఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య , హెచ్ఆర్సీ అధ్యక్షుడు మురళీధర్ , యూనిటీ ఆఫ్ మాల బాధ్యులు చింతల రవి, నీరుడు రాంబాబు , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు రవిచంద్ర చౌహన్ , రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ , నాయకులు భూక్యా శ్రీనివాస్ నాయక్ , గుగులోతు రవీందర్ నాయక్ , బి ఆర్ ఎస్ నాయకులు పగడాల



నరేందర్ , మందడపు శంకర్రావు , బి ఎస్ పి జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు చెరుకుపల్లి నాగేశ్వరరావు ,మిరియాల నాగరాజు ,రజక సంఘం నాయకులు పగిడిపల్లి నాగేశ్వరరావు , వడ్డెర సంఘం నాయకులు దేవళ్ల నాగేశ్వరరావు , మహాత్మా జ్యోతిబా పూలే ఐడియాలజీ సొసైటీ నాయకులు స్వరూప రెడ్డి ,ధనలక్ష్మి యాదవ్ , కనకం లక్ష్మి , వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్ర బాయి, నాయకులు జ్యోతి ,స్పందన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తాడోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# రాయల చంద్రశేఖర్ ఆశయాలను కొనసాగించాలి

**- మాస్ లైన్ కల్లూరు డివిజన్ కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాసరావు**

**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** రాయల చంద్రశేఖర్ 50 ఏళ్లు విప్లవోద్యమంలో ప్రజల కోసం ఎవలేని త్యాగం చేశారని, ఆయన నమ్మిన సిద్ధాంతం సోషలిజం కోసం కార్యకర్తలు, ప్రజలు పోరాడాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కల్లూరు డివిజన్ కార్య వర్గ సభ్యులు డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం తల్లాడ పట్టణం లో ఐ ఎఫ్ టి యు తల్లాడ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలోఆకాల మృతి చెందిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, ఎక్స్ ఆఫీషియో మెంబర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాయల చంద్రశేఖర్ చిత్ర పటానికి పుష్పగుచ్చాలుంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం షేక్ లాల్మియా మాట్లాడుతూ. అమరుడు రాయల చంద్రశేఖర్ బాల్యం నుండే ఆయన పెదనాన్న రాయల వెంకట నారాయణ, సోదరుడు రాయల సుభాష్ చంద్రబోస్ బాటలో నడిచాడని, ఆనాటి నుండి నేటి వరకు 50 ఏళ్ల పాటు విప్లవొద్యమంలో కొనసాగరని తెలిపారు. 1972లో ఖమ్మంలో ఎస్సార్ అండ్ బీజేఎస్ఆర్ కళాశాలలో విద్యార్థి సంఘ ఎన్నికలలో సహాయ కార్యదర్శిగా గెలిచి, పిడిఎస్యు లో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని ఆయన తెలిపారు. 1975లో ఎమర్జెన్సీ కాలంలో రహస్య జీవితం గడిపి పార్టీ ఇచ్చిన పనిలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో దలాలలో పనిచేస్తూ పోడు భూముల కోసం పోరాటాలు చేశాడని ఆయన అన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతల ప్రకారం ఖమ్మం, వరంగల్, పశ్చిమగోదావరి గుంటూరు, హైదరాబాద్ జిల్లాలలో బాధ్యతలు నిర్వహించాడని వారు తెలిపారు. ఎన్నో



ఎన్కౌంటర్లో నుండి తప్పించుకున్నాడని, ఎల్లన్న ఎన్కౌంటర్ సందర్భంగా కూడా ప్రజలకి ధైర్యం చెప్పి నిలబెట్టాడని, ముఖ్యంగా ఇల్లందు ప్రాంతంలో చెరగని ముద్ర వేశారని ఆయన తెలిపారు. కాచనపల్లి, ముస్ని ఎన్కౌంటర్లో ఐదుగురు అమరులు చనిపోయినప్పుడు ప్రజలను నిలబెట్టరని వారు చెప్పారు. చంద్రశేఖర్ అన్న నమ్మిన సిద్ధాంతం కోసం ఆశయాల కోసం ప్రజలు కార్యకర్తలు పని చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు తల్లాడ ఏరియా కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల మీరా, సహాయ కార్యదర్శి ఎస్కే లాల్ మియా, డి రమణ, సత్యం, పిచ్చయ్య, కృష్ణ, గురవయ్య, రాఘవులు, రాఘవ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం జీవోలను సవరించి రైతులకు రుణమాఫీ చేయాలి

**- రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ ఇవ్వాలి**
**- లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం..**
**- తల్లాడలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్..**

**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని అమలు చేసిన జీవోను సవరించి, అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం జిల్లా తల్లాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషన్ కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధనలు పెట్టటం సరైనది కాదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికే తెల్ల రేషన్ కార్డు అని ప్రతిపాదన చేస్తున్నప్పటికీ జీవోలో మాత్రం రేషన్ కార్డు ఉన్న వారికే అమలయ్యే విధంగా చేశారని గుర్తుచేశారు. వెంటనే ఆ జీవోలను మార్చాలన్నారు. జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా రైతులు ఉంటే లక్షల లోపు 57, 375 మందికి వచ్చిందని, ఆ లెక్కన చూసుకుంటే సుమారు 3 లక్షల మందికి రావాల్సి ఉందన్నారు. తల్లాడలో 2500 మంది ఉంటే 300 మందికి, కుర్నవల్లిలో 1179



ఉంటే 307 మందికే రుణమాఫీ వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా రుణమాఫీ చేశామని ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. రేషన్ కార్డుతో ముడి పెట్టకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ ఇవ్వాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ రైతులతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ శీలం సత్యనారాయణ రెడ్డి, సిపిఎం పార్టీ మండల కన్వీనర్, రైతు సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, రైతు సంఘం తల్లాడ మండల కన్వీనర్ నల్లమోతు మోహన్ రావు, చల్లా నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# కొత్త న్యాయ చట్టాల్లో సవరణ చేయాలి..

**బిఆర్ఎస్ డిప్యూటీ లీడర్ వద్దిరాజుకు ఖమ్మం బార్ సభ్యుల వినతి..**

**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** న్యూఢిల్లీ, కొత్త న్యాయ చట్టాల సవరణతో పాటు, సెంట్రల్ నోటరీ పబ్లిక్ అపాయింట్మెంట్, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తదితర అంశాలపై రాజ్యసభలో బీఆర్ఎస్ తరపున మాట్లాడాలని కోరుతూ ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఢిల్లీలో ఆ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ను కోరారు. ఈ మేరకు తాళ్లూరి దిలీప్ చౌదరి ఆధ్వర్యంలో ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, సంక్రాంతి రాజశేఖర్ తదితరులు సోమవారం ఢిల్లీలో పలువురు ఎంపీలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ కు బీఆర్ఎస్ పార్టీ పక్షాన లేఖ రాయడంతో పాటు.. సభలో ప్రస్తావన కూడా తెస్తానని హామీ ఇచ్చారు. సెంట్రల్ నోటరీస్ లను కాల్ ఫర్ చేయాలని న్యాయవాదులు ఎంతో కాలంగా పోరాడుతున్న విషయాన్ని ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు. కొత్త న్యాయ చట్టాలపై కూడా సమీక్ష జరపాలని విజ్ఞప్తులు వస్తున్న విషయాన్ని, అడ్వకేట్ ప్రొడక్షన్ బిల్ మీద కూడా మాట్లాడతామని రవిచంద్ర హామీ ఇచ్చారు.



## సమానత్వం కోసం పరితపించిన దాశరథి



**ఖమ్మం/ వైరా జూలై 22( అక్షరంన్యూస్):** వైరా:వెట్టిచాకిరి పోవాలని, జాగీరు వ్యవస్థ రద్దు కోసం పోరు సల్పిన దాశరథి కృష్ణమాచార్యులు ధన్యజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. వైరా సిపిఎం కార్యాలయం లో జరిగిన స్టడీ సర్కిల్ లో బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం ఆంధ్ర మహాసభ భూస్వామ్య వ్యవస్థ, రాక్షస పాలన పై తిరుగుబాటుకు నాంధి పలికింది అని తెలంగాణ ప్రజలను తన రచనలు ద్వారా చైతన్యం చేసిన త్యాగ జీవి దాశరథి అని అన్నారు, సమానత్వం కోసం పరితపించిన దాశరథి కరువు కాటకాలు లేని సమాజం కోసం పరితపించిన యోధుడు అని అన్నారు .ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు,కోట ప్రేమ్ కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏన్కూర్ జడ్పీహెచ్ఎస్‌లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం..



**ఖమ్మం/ వైరా జూలై 22 )అక్షరంన్యూస్):** జడ్ పి హెచ్ యస్ ఏన్కూర్ లో జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తాయిన సందర్భంగా ఈనెల 22 నుండి 29 వరకు శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు స్థానికంగా లభించే వనరులతో వివిధ రకాలైన నమూనాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయులు కే సైదయ్య తెలిపారు. ఈ విధంగా ప్రతిరోజు నిర్ణయించిన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నమూనాలను తయారు చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## దాశరథి కృష్ణమాచార్యులు ధన్యజీవి..

**- తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా దాశరథి..**

**ఖమ్మం/తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** దాశరథి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆయన్ని స్మరించుకుంటూ ఘనంగా నివాళ్లుర్పించారు. నాడు దాశరథి రగిల్చిన చైతన్య స్ఫూర్తి తోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కావాల్సిన సంకల్ప బలాన్ని ఇచ్చిందని నామ పేర్కొన్నారు. దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడు, కవి మరియు రచయిత అని అన్నారు. ఆయన రచనలు తెలంగాణ సాంస్కృతిక, సాహితీ రంగాల్లో విశేషమైన ప్రభావాన్ని చూపించాయన్నారు.



ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆయనదో విశిష్టశైలని దాశరథి తన సాహిత్యంతో తెలంగాణ ప్రజల్లో దేశభక్తి, సంఘీభావం, మరియు స్వాతంత్ర పట్ల అవగాహన పెంపొందించారని "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అనే పంక్తి ఆయన రచనలోని ఒక ప్రముఖమైనది గా నామ పేర్కొన్నారు. ఇది తెలంగాణ ప్రాంతం యొక్క సౌందర్యాన్ని మరియు వైభవాన్ని వర్ణిస్తుంది. "మా నిజాం రాజు జన్మజన్మల బూజు" అనే మాటలు దాశరథి రచనలోని నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న నిర్భంధాన్ని మరియు బాధలను ప్రతిబింబిస్తుందన్నారు. దాశరథి రచనలను పరిశీలిస్తే, ఆయన తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులను, వారి సమస్యలను, మరియు ఆశయాలను ప్రతిబింబిస్తూ ఉంటారు. తెలంగాణ భాష, సంస్కృతి, మరియు సాంప్రదాయాలను సాహిత్యంలో అత్యంత రమ్యంగా, ప్రేరణాత్మకంగా వర్ణించడంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి, రాసిన పాటలు, కవితలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయి. ఆయన సాహిత్య కృషి తెలంగాణ ప్రాంతం యొక్క సాహితీ వైభవాన్ని సమర్థంగా ప్రతిబింబించడమే కాకుండా, తెలంగాణ సమాజంలో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర వహించిందని నామ తెలిపారు. దాశరథి బాల్యం, చదువు తాను ప్రాతినిధ్యం వహించిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉండటం చాలా సంతోషంగా ఉందని నామ అన్నారు.

## రైతు రుణమాఫీ లబ్ధిదారులు రెన్యువల్ చేసుకోవాలి

**- తల్లాడ ఏపీజీవీబీ మేనేజర్ వీరన్న..**

**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులు బ్యాంకుల్లో రెన్యూవల్ చేయించుకోవాలని తల్లాడ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ వీరన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లక్షలోపు రుణాలు మాఫీ అయిన రైతులు ఆధార్ కార్డు, ఫోటోలు, వన్ బి, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని రావాలని సూచించారు. రెన్యువల్ చేసుకున్న అనంతరం కొద్ది రోజుల తర్వాత కొత్త రుణాలు కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. మేనేజర్ వరంగల్ బ్యాంకు నుండి తల్లాడకు బదిలీపై వచ్చారు. ప్రతి ఒక్కరూ మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## కృష్ణవేణికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు రాయల రాము..



**ఖమ్మం/ తల్లాడ జూలై 22 (అక్షరంన్యూస్):** తల్లాడ పట్టణానికి చెందిన గ్రామ పెద్దలు దగ్గుల అప్పిరెడ్డి కుమార్తె కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. ఆమె దశదినకర్మ సోమవారం తల్లాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము హాజరై ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు ఉన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609